https://epaper.dksaardyamlochaatimpu.com

E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

డీకే సారధ్యంలో

చాటింపు

తెలంగాణ దిన పత్రిక



హైదరాబాద్ సంపుటి : 18 సంచిక : 21 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ శనివారం,అక్టోబర్,17, 2026 పేజీలు : 8 వెల : రూ.1/-

విద్యార్థుల నిరసనలపై నిఘా..
కేంద్ర విదేశాంగ శాఖ ప్రతినిధి కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,అక్టోబర్,16:ప్రస్తుతం జరుగుతున్న విద్యార్థుల నిరసనల పరిణామాలపై కేంద్ర విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ కీలక వ్యాఖ్యలు చేశఆరు. ఈ నిరసనల పరిస్థితిని మన నిఘా సంస్థలు, సంబంధిత విభాగాలు నిశితంగా పరిశీలిస్తున్నాయని, పరిస్థితులకు అనుగుణంగా అవి తీసుకోనివ్వాల్సిన చర్యలను తీసుకుం టున్నాయని అన్నారు. శుక్రవారం ఢిల్లీలోని మీడియా సమావేశంలో మాట్లాడుతూ పలు అంతర్జాతీయ, ద్వైపాక్షిక అంశాలపై ఆయన స్పందించారు. అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని వీలైనంత త్వరగా ఖరారు చేసేందుకు ఇరు దేశాలు సానుకూల వాతావరణంలో చర్చలు జరుపుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవలే విదేశాంగ మంత్రి, వాణిజ్య మంత్రులు కూడా దీనిపై మాట్లాడిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పర్యటన సందర్భంగా విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, యూఏఈ విదేశాంగ మంత్రితో ద్వైపాక్షిక అంశాలపై సమగ్ర చర్చలు జరిపారని జైస్వాల్ వెల్లడించారు. వ్యాపారం, ఇంధనం, యూఏఈలో నివసిస్తున్న భారతీయుల సంక్షేమ ంపై ప్రధానంగా చర్చించినట్లు తెలిపారు. మాల్దీవుల అభివృద్ధి భాగస్వా మ్యంలో భారత్ కీలక పాత్ర పోషిస్తోందని జైస్వాల్ తెలిపారు. మాల్దీవుల ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు, 2024 అక్టోబర్‌లో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం..



మొదటి విడత రూ.3,000 కోట్ల కరెన్సీ స్వాప్ రోల్‌ఓవర్‌ను అక్టోబర్ 23 నుంచి అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించామని వెల్లడించారు. ఈ నిర్ణయం మాల్దీవుల ఆర్థిక స్థిరత్వానికి ఎంతగానో దోహదపడుతుం దని పేర్కొన్నారు. కొద్ది రోజుల క్రితం కెనడా విదేశాంగ మంత్రి ఢిల్లీ పర్యటనకు వచ్చి విదేశాంగ మంత్రితో పాటు ప్రధాని నరేంద్ర మోడీతో కూడా భేటీ అయ్యారని తెలిపారు. ఈ భేటీలో ప్రధానమంత్రి కెనడా పర్యటన అంశం చర్చకు వచ్చిందని, పర్యటన తేదీలను ఖరారు చేసే ప్రక్రియ ప్రస్తుతం జరుగుతోందని, తగిన సమయంలో అధికారికంగా ప్రకటిస్తామని రణధీర్ జైస్వాల్ తెలిపారు.

యూపీ ఎన్నికలపై అఖిలేష్ జోస్యం

ఈసీపై సంచలన వ్యాఖ్యలు



లక్నో: ఉత్తరప్రదేశ్‌లో ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి సమా జ్‌వాదీ పార్టీ జాతీయ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ బీజేపీ, భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)పై పలు తీవ్ర ఆరోపణలు చేశారు. ఓటర్ల జాబితాలోని అవకతవకలు, ప్రతిపక్ష ఓటర్ల పేర్లను తొలగించడం, నకిలీ ఓట్లను చేర్చడం వంటి విషయాలపై ఆయన ఎస్పీ కార్యకర్తలను హెచ్చరిస్తూ, అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈసారి ఈ కుంభకో ణాన్ని బయటపెడతామని అఖిలేష్ యాదవ్ ప్రకటించారు. పీడీఏ, ముస్లిం-యాదవ్ ఓటర్లు, యువ ఓటర్ల మద్దతుతో ఎస్పీ ఎన్నికల్లో విజయం సాధిస్తుందని ఆయన పేర్కొన్నారు.విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఓటర్ల జాబితాలోని అవకతవకల వల్ల ఒకే వ్యక్తి పేరు మీద ఒకటి కంటే ఎక్కువ ఓట్లు నమోద య్యాయని యూపీ మాజీ ముఖ్యమంత్రి ఆరోపించారు. ఒక వ్యక్తి ఒక ఓటు వేస్తే, బీజేపీ తొమ్మిది ఓట్లు వేస్తుందంటూ వ్యంగ్యంగా అన్నారు. వికాస్ యాదవ్, శంభు శంకర్ శర్మల పేర్లను ప్రస్తావిస్తూ ఆయన ఓటర్ల జాబితాపై ప్రశ్నలు లేవనెత్తారు. తమ పార్టీ 100 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఫిర్యాదులు దాఖలు చేసిందని అఖిలేష్ తెలిపారు. తమ శ్రేణుల ఓట్లను చేర్చేలా చూడాలని, ఎవరి పేరునూ తప్పుగా తొలగించకుండా చూడాలని ఆయన ఎస్పీ కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. ఈసీఐ ప్రత్యేక పునశ్చరణ శిబిరం సందర్భంగా అక్టోబర్ 17, 24 తేదీలు కీలకమైనవని ఆయన అభివర్ణించారు. బీజేపీ, ఈసీ ఎన్ని పన్నాగాలు పన్నినా పీడీఏ (పిచ్‌డా, దళిత, అల్పసంఖ్యాక), ముస్లిం-యాదవ్ ఓటర్లు, జెన్ జెడ్ వర్గాల కలయికతో ఈ ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయమని ఆయన తేల్చి చెప్పారు. అలాగే ఈసీకి వ్యతిరేక ఆందోళనల పట్ల కేంద్రం వ్యవహరిస్తున్న తీరును అఖిలేష్ యాదవ్ ఖండించారు. శాంతియుతం గా నిరసన తెలిపే హక్కు ప్రజలకు ఉందని చెప్పారు. ఢిల్లీలో నిరసనకారులపై దాడి చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న సాధారణ దుస్తుల్లోని వ్యక్తులను ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. వారు బీజేపీ భావజాలంతో సంబంధం కలిగి ఉన్నందువల్లే అరెస్టు చేయలేదని ఆరోపించారు. సాధారణ ప్రజలపైకి రాజకీయ కార్యకర్తలను ఉ సిగొల్పుతున్నారని విమర్శించారు. జర్మనీలో నాజీ హిట్లర్ కూడా ఇలాగే చేసేవాడని పేర్కొన్నారు. దేశానికి బీజేపీయే ఒక సంక్షోభం అని మండిపడ్డారు. ఈ సంక్షోభాన్ని తొలగిస్తేనే దేశం బాగుపడుతుందని మండిపడ్డారు. రాష్ట్రంలో దాదాపు అన్ని వర్గాల ప్రజలు బీజేపీ పాలన పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నారని వ్యాఖ్యానించారు.

తెలంగాణకు మరో దిగ్గజ కంపెనీ..
సీఎం రేవంత్‌తో హ్యుందాయ్ ప్రతినిధుల భేటీ

హైదరాబాద్,అక్టోబర్,16:తెలంగాణ రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి రాబోతోంది. ప్రపంచ ప్రసిద్ధ ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్ మోటార్స్ ఇండియా, రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో రూ. 8,528 కోట్ల వ్యయంతో అత్యాధునిక రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్‌అండ్ డీ) కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు ద్వారా సుమారు 4,275 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. శుక్రవారం హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ఇంజినీరిం గ్ ఎండీ చాంగ్యో చో నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. ఈ భేటీ సందర్భంగా తమ పెట్టుబడి ప్రణాళికలను సీఎంకు వారు వివరించారు. జహీరాబాద్‌లో నెలకొల్పబోయే ఆర్ అండ్ డీ కేంద్రం స్వరూపం,దాని ద్వారా లభించే ఉపాధి కల్పన వివరాలను ఈ సందర్భ ంగా ముఖ్యమంత్రికి తెలియజేశారు.
హ్యుందాయ్ ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన అనుమతు లను వెంటనే జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఇదే క్రమంలో, తెలంగాణలో కార్ల తయారీ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు



చేయాలని హ్యుందాయ్ ప్రతినిధుల ను ఆయన ఆహ్వానించారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అత్యంత అనుకూల వాతావరణం ఉ ందని, ప్రభుత్వ పరంగా అన్ని రకాల సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి వారికి హామీ ఇచ్చారు. ఈ భారీ పెట్టుబడితో జహీరాబాద్ ప్రాంతం ఆటోమొబైల్ హబ్‌గా మరింత అభివృద్ధి చెందనుండంటంతో పాటు, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు గణనీయంగా మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.

సింగరేణి స్కామ్‌పై కేటీఆర్ సవాల్..
రేవంత్‌కు డైరెక్ట్ ఛాలెంజ్



- సింగరేణి వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణకు డిమాండ్
- విదేశీ బొగ్గు కొనుగోళ్లలో కమిషన్ల దందా ఉందని ఆరోపణ
- రేవంత్‌ను ‘ఈఎంఐ ముఖ్యమంత్రి’ అంటూ కేటీఆర్ విమర్శలు
- నీటి ఎద్దడికి ప్రభుత్వమే కారణమంటూ ధ్వజం

హైదరాబాద్,అక్టోబర్,16:నర్సంపేట నియోజకవర్గ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సింగరేణిలో జరిగిన అక్రమాలు, కుంభకోణాలపై తాము నిలదీస్తే రేవంత్ రెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. మీడియా ముందు ఆరోపణలు చేయడం కాదని, దమ్ముంటే సింగరేణి కుంభకోణాలు , ప్రతిపాదిత విదేశీ బొగ్గు కొనుగోళ్లపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సవాల్ విసిరారు. కేవలం బొగ్గు అంశమే కాకుండా, సీఎం రేవంత్ రెడ్డి బామ్మర్ది సింగరేణిలో కొల్లగొట్టిన రూ. 10వేలకోట్ల కుంభకోణంతో పాటు సోలార్ పవర్ స్కామ్‌పై కూడా సమగ్ర న్యాయ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ లో 70 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం ఉన్న సింగరేణిని పక్కన పెట్టి, విదేశాల నుంచి బొగ్గు దిగుమతి చేసుకోవడా నికి రేవంత్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని కేటీఆర్ ఆరోపిం చారు. స్థానికంగా టన్ను బొగ్గు రూ. 3,800కి దొరికితే, ఆస్ట్రేలియా తదితర విదేశాల నుంచి కొనుగోలు చేస్తే రూ. 10 వేల నుంచి రూ. 12 వేల వరకుధర పడుతుందని, అక్కడ వచ్చే కమీషన్ల కోసమే ఈ విదేశీ కొనుగోళ్ల డ్రామాఆడుతున్నారని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ హయా లో సింగరేణిఅండతోనే రాష్ట్రంలో 24 గంటల పాటు నిరంతర విద్యుత్ సరఫరా సాధ్యమైందని, కానీ నేడు రేవంత్ రెడ్డి ఆ సంస్థను బదనామ్ చేస్తూ సంక్షోభంలోకి నెట్టేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అభిజీత్ దీప్కే, నేహా బోరాను అరెస్ట్ చేసిన ఢిల్లీ పోలీసులు..
నిరసన ప్రదేశంలో కఠిన ఆంక్షలు



న్యూఢిల్లీ,అక్టోబర్,16:లెహ్రోదో తిరంగా పేరుతో శుక్రవారం సాయంత్రం ర్యాలీ చేపట్టాలని సీజేపీ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా ఢిల్లీ పోలీసులు సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కేను అదుపులోకి తీసుకున్నారు. అలాగే,ఈ ర్యాలీకి వెళ్తున్న ఏఐఎస్ఏ అధ్యక్షురాలు నేహా బోరాను కూడా ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీప్కేను ఢిల్లీ, ఝండేవాలన్‌లోని నివాసం నుంచి అదుపులోకి తీసుకోగా.. నేహా బోరాను మండి హౌజ్ నుంచి అరెస్టు చేశారు. వీరిద్దరినీ అదుపులోకి తీసుకుంటున్న సమయంలో ఉద్రిక్తత తలెత్తింది. అటు పోలీసులు, ఇటు మీడియా.. మధ్యలో దీప్కే మద్దతు దారులతో ఈ ప్రదేశంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. దీప్కేను పోలీసులు అరెస్టు చేసి, తమ వాహనంలో తీసుకుని వెళ్లారు. అంతకుముందు దీప్కేకు ఢిల్లీ పోలీసులు రెండు వేర్వేరు నోటీసులు ఇచ్చారు. సెంట్రల్ పార్క్ వద్ద దీక్షకు వెళ్లకూడదని సూచిస్తూ.. ఢిల్లీ పోలీస్ యాక్ట్ కింద పోలీసులు ఒక నోటీస్ జారీ చేశారు. అనంతరం.. బీఎన్ఎస్ సెక్షన్ 163 కింద సౌత్ వెస్ట్ ఢిల్లీ పోలీసులు మరో నోటీస్ జారీ చేశారు. ఈ సమయంలో దీప్కే నివాసం వద్ద భారీ స్థాయిలో పోలీసులు మోహరించారు. తన అరెస్టు సమయంలో దీప్కే పోలీసులతో ఘర్షణకు దిగారు. సెంట్రల్ పార్క్ వద్ద ఆందోళన చేయడానికి వీల్లేదన్న పోలీసులతో.. మరో చోటును చూపించాల్సిందిగా కోరాడు.
మరో ప్రదేశం గురించి తర్వాత చెబుతామని, ఇప్పుడు అదుపులోకి తీసుకుంటున్నామని పోలీసులు తెలిపారు. తానేమీ చట్టాన్ని ఉ ల్లంఘించడం లేదని, తనను ఎందుకు అదుపులోకి తీసుకుంటున్నారని ప్రశ్నించారు. మరోవైపు ఈ రోజు నిరసన జరగాల్సి ఉన్న కన్నాట్ ప్లేస్, సెంట్రల్ పార్క్‌ను పోలీసులు మూసివేశారు. పార్క్ వద్ద ఆంక్షలు విధించారు. భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో సెంట్రల్ ఢిల్లీ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో సీజేపీ ఆందోళన నిర్వహిస్తోంది. ఈ క్రమంలో నిబంధనలు ఉల్లంఘించారంటూ రెండు రోజులక్రితం ఢిల్లీ పోలీసులు సీజేపీ అగ్రనేతలు అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్‌ను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు. వారికి కోర్టు ఐదు రోజుల జుడీషియల్ కస్టడీ విధించింది. ప్రస్తుతం ఇద్దరూ తిహార్ జైలులో ఉన్నారు.

ఓటర్ల తొలగింపుపై
ప్రచారం అవాస్తవం: తెలంగాణ సీఈవో



హైదరాబాద్, అక్టోబర్ 16: తెలంగాణలో భారీగా ఓట్లను తొలగిం చారంటూ జరుగుతున్న ప్రచారంపై సీఈవో సుదర్శన్ రెడ్డి స్పందించారు. ఈ సందర్భంగా ఓటర్ల తొలగింపు ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్రవ్యాప్తంగా 73.39 లక్షల మంది ఓటర్ల ఫారాలు అందలేదని.. 2.64 కోట్ల మంది ఓటర్ల ఫారాలు స్వీకరించామని తెలిపారు. ఫారాలు అందిన ఓటర్ల పేర్లు ముసాయిదా జాబితాలో చేర్చినట్లు చెప్పారు. ఫారాలుఅందని వారి పేర్లు ముసాయిదా జాబితాలో లేవన్నారు. బీఎల్ వో)లు ఇంటింటికీ వెళ్లి ఫారాలను సేకరించారని సీఈవో తెలిపారు. ఓటర్లకుఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఫారాల సమర్పణకు అవకాశమి చ్చామ న్నారు. ఫారాలు అందని వారి కోసం క్లెయిమ్స్, అభ్యంతరాల ప్రక్రియ చేపట్టామన్నారు. అక్టోబర్ 15, 16 తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. కొత్త ఓటర్లు,యువ ఓటర్ల నమోదు కు ప్రత్యేక అవకాశం కల్పించినట్లు చెప్పారు. అర్హులైన ప్రతి ఓటరుకు జాబితాలో చోటు కల్పిస్తామని స్పష్టం చేశారు. 73.39 లక్షల మందికి అవకాశం ఇవ్వకుండా తొలగించారన్న ప్రచారం అవాస్తవ మని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లో డ్రగ్స్ కలకలం.. ఇద్దరిని పట్టుకున్న ఈగల్ ఫోర్స్



హైదరాబాద్,అక్టోబర్,16:తెలంగాణను మత్తు రహిత రాష్ట్రంగా తీర్చి దిద్దేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బలగాలు ‘ఈగల్ ఫోర్స్’ మరోసారి పంజా విసిరింది. హైదరాబాద్ నగర శివార్లలో మత్తు పదార్థాల సరఫ రాపై ప్రత్యేక దృష్టి సారించిన ఈగల్ ఫోర్స్ అధికారులు, బాచుపల్లి పోలీస్ స్టేషన్ ఆకస్మిక దాడులు నిర్వహించి భారీగా డ్రగ్స్, గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుంది.మేరకు దాడి చేసిన అధికారులు 6.2 గ్రాముల ఎండీఎంఏ 5.83 గ్రాముల ఎండు గంజాయి,2 ఐఫోన్లు,డిజిటల్ వెయింగ్‌మెషిన్ స్వాధీనం చేసుకున్నారు.

మల్కాపురం గ్రీన్ ఇండస్ట్రీస్‌లో భారీ పేలుడు



యాదాద్రి: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం మల్కాపురం గ్రీన్ ఇండస్ట్రీస్ పార్క్‌లో భారీ పేలుడు సంభవించింది. ఆక్సీ-నై పరిశ్రమలో ఆక్సిజన్ సిలిండర్లు ఒక్కసారిగా పేలిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పరిశ్రమలో సిలిండర్లలో ఆక్సిజన్ నింపుతున్న క్రమంలోనే ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో బిహార్ ప్రాంతానికి చెందిన మనీష్ కుమార్ అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానానికి సంబంధించి విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసిదర్యాప్తు చేపట్టారు. సిలిండర్ల పేలుడుతో గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో కలకలం రేగింది. భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో పరిసర ప్రాంతాల్లోని కార్మికులు భయాందోళనలకు గురయ్యారు.

నీటి వృధాను అరికట్టండి

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు



ఎల్బీనగర్, అక్టోబర్ 16 (డీకే చాటింపు) ఎలినీనో ప్రభావంతో తాగునీటి సమస్య అధికంగా ఉండే అవకాశం ఉంది కావున ప్రజలు నీటిని వృధా చేయకుండా నల్లాలు ఆల్ ఆఫ్ ఉండే విధంగా చూసుకోవాలని పైప్లైన్ల లీకేజీలను అరికట్టాలని లీకూ కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రత్యామ్నాయ నీటి వనాలను గుర్తించాలని పశుగ్రాసానికి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని పంట వ్యర్థాలను వృధా చేయకుండా చూడాలని పశువులు కలిగిన రైతులు తమ పొలాల్లో మేత కోసం కొంత భాగం పశుగ్రాసం ఏర్పాటు చేసుకోవాలని కోరారు లోటు వర్షపాతం ఉండడంతో యాసంగి సీజన్లో నీటి లభ్యతాన్ని బట్టి పంటను సాగు చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని పంటలు లేకపోవడం వల్ల కరువు పరిస్థితులు తలెత్తుతాయని రాంజీ పథకం కింద ప్రజలకు ఉపాధి కల్పిస్తున్న ఎలినినో ప్రభావంతో అవి చాలా ప్రభావితం అవుతాయని ప్రత్యేకించి నీటి కరువును జయించడానికి ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని పంట పొలాలలో వంటకుంటా కమ్యూనిటీ సోప్ బిట్లు బోర్వెల్ రీఛార్జి స్ట్రక్చర్లు ఏర్పాటు చేయడం వలన భూగర్భ జలాలు పెంపొందించుకోవచ్చు అని తెలిపారు. ఎలినీనొ ప్రభావంతో భూగర్భ జలాల పరిస్థితి దారుణంగా పడిపోయే ప్రమాదం ఉందని ఉన్న కొద్దిపాటి నీటితో ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని అత్యధికంగా కూరగాయలు ఆకుకూరలు సాగు చేయాలని సూచించారు నీటి పొదుపు పాటించాలని కోరారు యాసంగిలో వరి పంటను పూర్తిగా నిలిపివేయాలని ప్రభుత్వం సూచించిన దానిని అమల్లో పెట్టాలని కోరారు.

అమ్మవారి మండపాలను దర్శించుకున్న కళ్లెం నవజీవన్ రెడ్డి



ఎల్బీనగర్, (డీకే చాటింపు) దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా హైకోర్ట్ కాలనీ డివిజన్‌లోని హై కోర్ట్, భూలక్ష్మి నగర్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాన్ని హయత్ నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి గారు దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించే దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించడంతో పాటు, ఐక్యతను చాటుతాయని పేర్కొన్నారు. అనంతరం ఉత్సవ నిర్వాహకులతో మాట్లాడి ఉత్సవాల నిర్వహణ వివరాలను తెలుసుకుని, అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హయత్ నగర్ మరియు హై కోర్ట్ కాలనీ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, మర్రి మధు సుధన్ రెడ్డి, నవజీవన్ రెడ్డి గారి తనయుడు కళ్లెం వార్షిక్ రెడ్డి,సీనియర్ నాయకులు గోవింద చారి, శ్రీధర్ రెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు ఇట్టబోయిన నర్సింహా, నాయకులు లక్ష్మణ్,వెంకట్ రెడ్డి, అరుణ్, బీజేవైఎం నాయకులు రీతిక్, ప్రణవ్, రోహన్, మరియు స్థానిక నాయకులు, బీజేపీ కార్యకర్తలు, ఉత్సవ నిర్వాహకులు మరియు భక్తులు పాల్గొన్నారు.

అర్హత గల ప్రతి ఓటరు

వివరాలు జాబితాలో ఉండాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



క్యాతన్ పల్లి (డీకే చాటింపు): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో అర్హత గల ప్రతి ఒక్క ఓటరు వివరాలు జాబితాలో ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని 2, 3, 18 వార్డులలో గల పోలింగ్ కేంద్రాలను మండల తహసిల్దార్ సతీష్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఈ నెల 15, 16 తేదీలలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం జరిగిందని, వలస, డబుల్, మృతి చెందిన ఓటర్ల వివరాలను పరిశీలించి నిబంధనల ప్రకారం జాబితా నుండి తొలగించడం జరిగిందని తెలిపారు. ఈ క్రమంలో అర్హత గల ఓటర్ల వివరాలు తొలగించినట్లయితే సంబంధిత వ్యక్తుల నుండి ఫారం 6 ద్వారా దరఖాస్తు స్వీకరించి, వివరాలను పరిశీలించి జాబితాలో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకుని అర్హత గల ఓటర్ల వివరాలు జాబితాలో నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వలస, డబుల్, మృతి చెందిన వారి వివరాల తొలగింపునకు ఫారం 7 ద్వారా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలోని దాదాపు 1 లక్ష 70 వేల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయగా 1 లక్ష 64 వేల మంది నుండి ధ్రువపత్రాలు స్వీకరించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతుందని, నిర్ణీత గడువులోగా పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. జాబితాలో అర్హత గల ప్రతి ఒక్కరి వివరాలు ఉండాలని, అనర్హుల వివరాలు ఉండకూడదని తెలిపారు. ప్రత్యేక శిబిరాల తేదీలలో బూత్ స్థాయి అధికారులు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలలో అందుబాటులో ఉంటారని, ఓటర్లకు ఏమైనా సందేహాలు, సమస్యలు ఉన్నట్లయితే సంప్రదించి పరిష్కరించుకోవాలని తెలిపారు. దరఖాస్తు ఫారాలు, నోటీసులకు సంబంధించి ధృవపత్రాలను అందించవచ్చని తెలిపారు. ముసాయిదా జాబితాపై ఎవరికైనా అభ్యంతరాలు, ఫిర్యాదులు ఉన్నట్లయితే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండలిని మండల తహసిల్దార్ తో కలిసి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేందుకు మున్సిపాలిటీలు, గ్రామాలలో అవసరమైన లైటింగ్, పారిశుద్ధ్యం ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. దసరా ఉత్సవాలలో భాగంగా దుర్గామాత మండళ్ల ఏర్పాటులో భాగంగా అవసరమైన పోలీస్, రెవెన్యూ, విద్యుత్ సంబంధిత శాఖల అనుమతులు నిబంధనల ప్రకారం జారీ చేయడం జరిగిందని తెలిపారు. బతుకమ్మ, దసరా పండుగను ప్రజలందరూ సామరస్యంతో సంతోషంగా జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె బాటలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు..

వైద్య సేవలపై ప్రభావం..!

-నారాయణపేట జిల్లాలో 78 క్యాడర్లలో 170 మంది ఉద్యోగులు సమ్మెలో... -ఈనెల13 నుంచి సమ్మె బాటలో... -న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఉద్యోగుల వినతి... -వైద్య సేవలపై రోజురోజుకు పెను ప్రభావం... -నారాయణపేట జిల్లా కేంద్రంలోని అర్బన్ హెల్త్ సెంటర్లో ప్రభావం...



నారాయణపేట,(డీకే చాటింపు): జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ డిమాండ్లు తీర్చాలని సమ్మె బాట పట్టారు.నారాయణపేట జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వివిధ కేటగిరీల్లో 78 క్యాడర్లలో 170 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు17 వేల మంది సమ్మె బాట పట్టడంతో వైద్య సేవలపై తీవ్ర ప్రభావం పడుతోంది.సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న వేళ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మెతో ఇబ్బందిగా మారింది. పనిచేస్తున్న వారిలో 70శాతం మంది ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు ఔట్‌సోర్సింగ్ కాగా..వారి డిమాండ్ల సాధన కోసం నారాయణపేట జిల్లా కేంద్రంలో మున్సిపల్ పార్కు దగ్గర ఈ నెల13నుంచి నిరవధిక సమ్మె చేపట్టారు. సగం మంది నిరవధిక సమ్మెలో పాల్గొని గత నాలుగు రోజులు అయ్యింది. ప్రభుత్వం తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, మహిళా ఉద్యోగులు ముగ్గుల రూపకంగా వినూత్నంగా నిరసన వ్యక్తం చేసి ఆకట్టుకున్నారు. కరోనా మహమ్మారి సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలు అందించిన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడంలో ప్రభుత్వం తాత్సారం చేస్తోందని ఈ సందర్భంగా వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఏళ్ల తరబడి తక్కువ వేతనాలతో పనిచేస్తూ కుటుంబ పోషణలో అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వారు వాపోతున్నారు.

జిల్లాలో 170 మంది ఉద్యోగులు సమ్మెలో

నారాయణపేట జిల్లాలో ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు సమ్మెలోకి వెళ్లడంతో వైద్య సేవలపై తీవ్ర ప్రభావం పడుతుంది.జిల్లాలో 11ప్రైమరీ హెల్త్ సెంటర్లు,89 ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్,2 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా హాస్పిటల్ ఒకటి, జిల్లా ఆస్పత్రి ఒకటి. 78 క్యాడర్లలో 170 మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటున్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ లో

నారాయణపేట జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మండలంలోని అప్పక్ పల్లి గ్రామం దగ్గర ఉంది. పట్టణంలో అర్బన్ హెల్త్ సెంటర్ ఉంది.ప్రతినిత్యం 100 కు పైగా ఓపి పేషెంట్లు ఈ ఆరోగ్య కేంద్రానికి వచ్చేవారు.అయితే ప్రస్తుతం ఈ కేంద్రంలో పనిచేసే డాక్టర్ తో పాటు మిగతా సిబ్బంది సమ్మెబాటలోకి వెళ్లడంతో అక్కడ వైద్య సేవలు అస్తవ్యస్తంగా మారాయి. ప్రస్తుతం ఈ కేంద్రంలో నర్సింగ్ ఆఫీసర్,ల్యాబ్ టెక్నికల్,సూపర్వైజర్ విధులు నిర్వహిస్తున్నారు.

డాక్టర్,నలుగురు ఏఎన్ఎంలు,ఇద్దరు నర్సింగ్ ఆఫీసర్లు,సపోర్టింగ్ స్టాఫ్ ఒకరు సమ్మెలోకి వెళ్లారు. మొత్తం14 మంది గాను ముచ్చటగా ముగ్గురుతోనే ఈ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్య సేవలను అందిస్తూ వస్తుంది.ఈ నెల13 నుంచి సమ్మెలోకి వెళ్లడంతో ప్రస్తుతం ఆశ వర్కర్ల సహకారంతో ఈ కేంద్రం కొనసాగుతుంది.ఈ అర్బన్ హెల్త్ సెంటర్లో రోజువారిగా ఓపి100కు పైగా ఉంటుంది. ఈనెల15న103 ఓపి నమోదయింది.శుక్రవారం తక్కువగా ఓపి నమోదయింది.ప్రధానంగా గర్భిణి మహిళలు పలు ఇబ్బందులకు గురవుతున్నారు.పూర్తిస్థాయి వైద్య సేవలు అక్కడ ఓపి పేషెంట్లకు లభించడం లేదు. దాంతో చాలామంది పేషెంట్లు జిల్లా ప్రధాన ఆసుపత్రికి వెళ్ళవలసి వస్తుంది.ఈ పరిస్థితి ఒక నారాయణపేట పట్టణంలోనే కాదు జిల్లావ్యాప్తంగా కానవస్తుంది. జిల్లావ్యాప్తంగా 170 మంది ఉద్యోగులు ప్రస్తుతం విధులకు దూరంగా ఉండి సమ్మెలో కొనసాగిస్తున్నారు. దాంతో ఆయా ఆసుపత్రిలో వైద్య సేవలు పూర్తిస్థాయిలో లభించడం లేదని చెప్పవచ్చు.ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు,జిల్లా ప్రజలు ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు.

రెండు బార్లకు లక్కీ డ్రా

-మక్తల్,మద్దూరులో నూతనంగా 2 బి బార్ల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్... -బార్లకు వచ్చిన అప్లికేషన్లను లక్కీ డ్రా తీసిన అడిషనల్ కలెక్టర్... పాల్గొన్న మహబూబ్ నగర్ ఎక్సైజ్ డీసీ విజయ్ భాస్కర్ రెడ్డి,మహబూబ్ నగర్ ఏఈఎస్ సుధాకర్... -ప్రశాంతంగా ముగిసిన లక్కీ డ్రా... -నారాయణపేట ఎక్సైజ్ సీఐ ఎన్.సైదులు...



నారాయణపేట,(డీకే చాటింపు): నారాయాణపేట జిల్లాలోని మక్తల్, మద్దూర్ లో నూతనంగా ఏర్పాటు చేయనున్న బార్లకు శుక్రవారం నారాయణపేట జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన లక్కీ డ్రాలో జిల్లా అడిషనల్ కలెక్టర్ తో పాటు మహబూబ్ నగర్ ఎక్సైజ్ డీసీ విజయ్ భాస్కర్ రెడ్డి, మహబూబ్ నగర్ ఏఈఎస్ సుధాకర్,నారాయణపేట ఎక్సైజ్ సీఐ ఎన్. సైదులు, కోస్గి ఎక్సైజ్ సీఐ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో మక్తల్ ,మద్దూర్ బార్లకు వచ్చిన అప్లికేషన్ల నుంచి అడిషనల్ కలెక్టర్ డ్రా తీశారు.ఇందులో మక్తల్ బార్ అప్లికేషన్ నెంబర్-37(మధుబాబు)కు వరించింది.అలాగే మద్దూర్ బార్ అప్లికేషన్ నెంబర్-49 (రవితేజ)కు వరించింది.ఈ విషయాన్ని నారాయణపేట ఎక్సైజ్ సీఐ ఎన్. సైదులు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

అప్లికేషన్ల ద్వారా రూ.96 లక్షల ఆదాయం

జిల్లాలోని మక్తల్,మద్దూరు ల్లో నూతనంగా ఏర్పాటు కానున్న రెండు 2 బి బార్లకు అప్లికేషన్ల ద్వారా ఎక్సైజ్ శాఖకు మంచి ఆదాయం లభించింది.ఒక్కొక్క అప్లికేషన్ కు ఎక్సైజ్ శాఖ లక్ష రూపాయల ఫీజు(తిరిగి చెల్లించని ఫీజు) నిర్ణయించింది.ఇందులో భాగంగా మక్తల్ బార్ కు మొత్తం 38 అప్లికేషన్లు వచ్చాయి.వాటి ద్వారా రూ. 38 లక్షల ఆదాయం ఎక్సైజ్ శాఖకు లభించింది.అలాగే మద్దూరు బార్ కు 58 అప్లికేషన్లతో రూ.58 లక్షల ఆదాయం సమకూరింది.ఈ రెండు బార్ల ద్వారా 96 లక్షల ఆదాయం ఎక్సైజ్ శాఖకు లభించింది.మద్దూరు బార్ కు ఒకేసారి 58 అప్లికేషన్లు రావడం విశేషం.

కొల్లంపల్లి దర్గాలో నేటి నుంచిమెగా ఉచిత ఆరోగ్య శిబిరం

-శని,ఆదివారం ఉచిత శిబిరం...-నారాయణపేట యశోద కేర్ హాస్పిటల్స్,ఓల్డ్ గంజ్ ఆధ్వర్యంలో...-కరపత్రం ఆవిష్కరణ...



నారాయణపేట,(డీకే చాటింపు): సర్వమత సమ్మేళనం సందర్భంగా నారాయణపేట యశోద కేర్ హాస్పిటల్స్,ఓల్డ్ గంజ్ ఆధ్వర్యంలో నారాయణపేట మండలం కొల్లంపల్లి దర్గా వద్ద శని, ఆదివారం (ఈనెల17, 18 తేదీల్లో)రెండు రోజుల పాటు మెగా ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నారు.ఈ ఆరోగ్య శిబిరానికి సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం యశోద కేర్ హాస్పిటల్స్‌లో ఆవిష్కరించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం, ఆరోగ్యంపై అవగాహన కల్పించడం ఈ శిబిరం ముఖ్య ఉద్దేశమని ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది.శిబిరంలో అందించే సేవలు,ఉచిత వైద్యుల సంప్రదింపులు,సాధారణ ఆరోగ్య పరీక్షలు,ఎముకలు, కీళ్లు,నడుము నొప్పులు, గాయాలకు వైద్య సలహాలు, మహిళల ఆరోగ్య సమస్యలపై సంప్రదింపులు. జనరల్ సర్జరీ సంబంధిత వైద్య సలహాలను అందించనున్నారు. అందుబాటును బట్టి మందుల పంపిణీ.తదుపరి పరీక్షలు,చికిత్సకు మార్గదర్శకత్వం.యశోద కేర్ హాస్పిటల్స్ వైద్య నిపుణులు డాక్టర్ జె.నవీన్ కుమార్ రెడ్డి ఆర్థోపెడిక్స్,కాంప్లెక్స్ ట్రామా ఉ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్,డాక్టర్.రవీందర్ లకావత్(కన్సల్టెంట్ రేడియాలజిస్ట్),డాక్టర్ రాజ్ కుమార్ మంచాల జనరల్ ఉ లాపరోస్కోపిక్ సర్జన్,డాక్టర్ అమిత గైనకాలజిస్ట్,ప్రసూతి వైద్య నిపుణురాలుఉ ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్ట్,డాక్టర్ ప్రశాంత్ రెడ్డి జనరల్ ఫిజీషియన్,డాక్టర్ మహేష్ ఫిజియోథెరపిస్ట్,డాక్టర్ రుహి రిజ్వానా యునాని వైద్య నిపుణురాలు.యశోద కేర్ హాస్పిటల్స్,ఓల్డ్ గంజ్, నారాయణపేట.క్యాంప్ వైద్యులు డాక్టర్ ప్రశాంత్ రెడ్డి, క్యాంప్ ఇన్‌చార్జి వెంకటేష్, యశోద కేర్ హాస్పిటల్స్ వ్యవహరిస్తారు.ఈ సందర్భంగా యాజమాన్యం మాట్లాడుతూ ప్రజలు తమ ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సలహాలు పొందాలని,ఈ రెండు రోజుల ఉచిత ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

డీకే చాటింపు కథనంతో...

ఎక్సైజ్ శాఖ సమాచార హక్కు చట్టం బోర్డుపై తాజా సమాచారం

-హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు... -నారాయణపేట ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో...



నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట ఎక్సైజ్ శాఖ సర్కిల్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం- 2005 బోర్డుపై ఎక్సైజ్ అధికారులు తాజా అధికారుల పేర్లను నమోదు చేశారు."అధికారులు మారిన 'మారని' పేర్లు..!"అనే శీర్షికన గత నెల 29న డీకే చాటింపు దినపత్రికలో వచ్చిన ఓ కథనానికి స్థానిక ఎక్సైజ్ అధికారులు స్పందించారు. నారాయణపేట ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం బోర్డుపై తాజా వివరాలను నమోదు చేశారు.ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న సిఐ,ఎస్ఐలు ఇటీవల ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన ఆ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం- 2005 బోర్డుపై బదిలీపై వెళ్లిన అధికారుల పేర్లు దర్శనమిస్తున్న విషయాన్ని 'డీకే చాటింపు'దినపత్రిక వెలుగులోకి తీసుకురావడం.. అందుకు స్థానిక ఎక్సైజ్ శాఖ సీఐ ఎన్.సైదులు స్పందించారు.ప్రస్తుతం విధి నిర్వహణలో ఉన్న అధికారుల పేర్లను ఆ బోర్డుపై నమోదు చేశారు.ప్రస్తుతం నారాయణపేట ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం దగ్గర పౌర సమాచార హక్కు చట్టం-2005 చట్టం బోర్డుపై పౌర సమాచార అధికారిగా బి.శంకర్(ఎక్సైజ్ ఎస్సై), సహాయ సమాచార అధికారిగా పి.రఘు నాయక్ (జూనియర్ అసిస్టెంట్), అప్పిలేట్ అధికారిగా ఎన్. సైదులు(ఎక్సైజ్ సిఐ)పేర్లను నమోదు చేశారు.ప్రస్తుతం సిఐగా సైదులు కొనసాగుతున్నారు.గతంలో ముగ్గురు ఎస్సైలు విధులు నిర్వహించగా ప్రభుత్వం వారి స్థానంలో ఇద్దరు ఎస్ఐలను మాత్రమే ప్రస్తుతం నియమించింది.సమాచార హక్కు చట్టం బోర్డుపై తాజా అధికారుల పేర్ల నమోదు జరగడంతో నారాయణపేట ఎక్సైజ్ శాఖ సర్కిల్ పరిధిలోని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.తాజా వివరాల నమోదుతో ఎక్సైజ్ శాఖ పరంగా ఏదైనా సమస్య ఉంటే నేరుగా సంబంధిత అధికారులను..లేదా ఫోన్ ద్వారా సంప్రదించే అవకాశం ఏర్పడిందని వారు తెలిపారు. డీకే చాటింపు దినపత్రిక వార్త ద్వారా ఎక్సైజ్ అధికారులు తాజా వివరాలను నమోదు చేసి ప్రజల ముందు ఉంచారు.

డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
శనివారం,అక్టోబర్,17, 2026

అభద్రత..!?

సాఫ్ట్‌వేర్ రంగంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు కోటి ఆశలతో ఆ రంగాన్ని ఎంచుకున్న యువతరంలో కలవరాన్ని సృష్టిస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అంటే భవిష్యత్తుకు ఎటువంటి ఢోకా లేదన్న ఒకప్పటి పరిస్థితి ఇప్పుడు మారిపోతోంది. ఏ రోజు ఉద్యోగం ఉంటుందో, ఏ రోజు ఊడుతుందో తెలియని స్థితి నెలకొంటోంది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) తన ఉద్యోగుల్లో రెండు శాతం మందిని తొలగిస్తున్నట్లు కొద్దిరోజుల క్రితం చేసిన ప్రకటన ఈ పరిస్థితికి తాజా నిదర్శనం. టిసిఎస్ ఒక్కటే 12 వేల మందిని ఇంటికి పంపనుందని సమాచారం. పిడుగుపాటు లాంటి ఈ ప్రకటనతో టిసిఎస్ ఉద్యోగుల్లో కలకలం రేగింది. ఒక్క టిసిఎస్సే కాదు, ఇన్‌ఫోసిస్, హెచ్‌సిఎల్, విప్రోల వంటి సంస్థలదీ ఇదే బాట! ఉద్యోగులను తొలగించడంలో ఒకదానితో మరొకటి పోటీ పడుతున్నాయి. ఇలా ఉద్యోగాలు కోల్పోతున్న వారిలో మిడ్‌లెవల్, సీనియర్ మేనేజర్లే అత్యధికులు! దేశీయ సంస్థలే కాదు, గ్లోబల్ టెక్ కంపెనీగా అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన మైక్రోసాఫ్ట్ కూడా భారీ సంఖ్యలో ఉద్యోగులపై వేటు వేస్తోంది. ఈ ఏడాదిలోనే ఆ సంస్థ 15వేల మంది ఉద్యోగులను ఇళ్లకు పంపింది. మే నెలలో ఆరువేల మందిని, జులైలో 9వేల మందిని ఆ సంస్థ తొలగించినట్లు అందుబాటులో ఉన్న గణాంకాలు చెబుతున్నాయి. మైక్రోసాఫ్ట్ మొత్తం ఉద్యోగుల్లో ఇది నాలుగు శాతం! క్లౌడ్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ ఉద్యోగులను ఆ సంస్థ తొలగిస్తోంది. వాల్‌స్ట్రీట్ జర్నల్ అధ్యయనం ప్రకారం ఈ ఏడాది జూన్ నాటికి ప్రపంచవ్యాప్తంగా 61వేల మందికిపైగా టెక్ రంగంలో ఉద్యోగాలు కోల్పోయారు. మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ తదితర అంతర్జాతీయ సంస్థల ఉద్యోగులు ఈ జాబితాలో ఉన్నారు. 2019 తరువాత నుండి ఎంట్రీ లెవల్ ఉద్యోగుల నియామకం దాదాపు సగానికి పైగా తగ్గిపోయింది. రానున్న రోజుల్లోనూ ఈ పరిణామం కొనసాగనుంది. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ) ప్రభావం రోజురోజుకి పెరుగుతుండటంతో సాధారణ కోడింగ్, టెస్టింగ్ వంటి ఉద్యోగ అవకాశాలు తగ్గుతున్నాయి. 'ఎఐ ఫస్ట్' సంస్కరణల్లో భాగంగా ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయంటూ సత్య నాదెళ్ల చేసిన వ్యాఖ్యలు ఈ సందర్భంగా గమనార్హం. భారీ లాభాలు వస్తున్నప్పటికి ఉద్యోగులపై వేటు వేయడాన్ని మైక్రోసాఫ్ట్ కొనసాగిస్తోంది. దీనికి ఎప్పటికప్పుడు ఏదో ఒక కారణాలను ఆ సంస్థ చెబుతోంది. మన దేశంలో కొంతకాలంగా టెక్‌రంగం ఒత్తిడిలో కొనసాగుతోంది. సంస్థలు నష్టాల్లో లేనప్పటికీ, గతంతో పోలిస్తే లాభాలు ఆశించినట్లు లేవని చెబుతున్నారు. ఫలితంగా ఐటి సేవల్లో మందగమనం చోటుచేసుకుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. గ్లోబల్ క్లయింట్లకు తక్కువ ఖర్చుతో సేవలందించడమన్నది భారత టెక్ రంగం ప్రధాన వ్యూహంగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఏమైనప్పటికీ, సాఫ్ట్‌వేర్ రంగంలో చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలు తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ముఖ్యంగా 40 అంతకన్నా ఎక్కువ వయసున్న వారు ఉద్యోగాలను కోల్పోతే తిరిగి సంపాదించుకోవడం చాలా కష్టంగా మారుతోంది. చేస్తున్న ఉద్యోగాలపై ఉన్న నమ్మకంతో చేసిన అప్పులు తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతున్న దుస్థితి అక్కడక్కడా కనపడుతోంది.



బతుకమ్మ ,దేవి నవరాత్రి సంబరాల్లో
ఈ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ రాజశేఖర్





నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 16(డీకే చాటింపు): ఆర్మూర్ పట్టణంలో బతుకమ్మ ,దేవి నవ రాత్రుల సంబరాలు ఘనంగా నిర్వహి స్తున్నారు. హిందూ సేన యూత్, త్రిపుర మాత యూత్, శ్రీరామ కాలనీలలో శ్రీ దుర్గా దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండపాలలో ప్రతిష్టించిన శ్రీ దుర్గా దేవి అమ్మవారిని జు= ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ దర్శించుకున్నారు. శ్రీ దుర్గా దేవి అమ్మవారికి సతీసమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. హిందూ సేన యూత్ శ్రీ దుర్గా దేవి మండపం వద్ద జరిగిన అన్నప్రసాద వితరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ దుర్గాదేవి మండపాల నిర్వాహకులు జు= ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ సునీత దంపతులను ఘనంగా శాలువాతో సన్మానించారు. అమ్మవారి దయతో ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలందరూ బాగుండాలని జు= ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ కోరుకున్నారు. ప్రజలు ప్రశాంతంగా పండుగలను నిర్వహించుకోవాలని కోరారు. అలాగే శ్రీరామ కాలనీలో జరిగిన బతుకమ్మ పండుగ సంబరాలలో పాల్గొని ఆడబిడ్డలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పద్మశాలి సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో రాజశేఖర్ దంపతులు పాల్గొన్నారు. పద్మశాలి సంఘ సభ్యులు సమాజ సేవలో ముందుంటున్నారని శుభ సూచకమైన కొన్ని ఆడారు. యువకులు మహిళలు అన్ని రంగాలలో రాణించాలని కోరారు.జు= ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ వెంట జు= ఫౌండేషన్ సభ్యులు రామ్ ప్రసాద్, జీవన్, నూకల శేఖర్, టైలర్ వినోద్, దోమల శ్రీను, లక్ష్మణ్, యూత్ సభ్యులు, నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

మారుమూల గిరిజన పల్లెలకూ మిషన్ భగీరథ జలాలు
అమ్రాబాద్తండా సందర్శించిన కలెక్టర్ ఇలా త్రిపాటి



నిజామాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 16 (డీకే చాటింపు): మామూలు గిరిజన ప్రాంతాలకు సైతం మిషన్ భగిరథ ద్వారా రక్షిత మంచినీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. మోపాల్ మండలం అమ్రాబాద్ తండాను కలెక్టర్ గురువారం సందర్శించారు. మంచిప్ప రిజర్వాయర్ నిర్మాణంలో పలు తండాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉండడంతో ఇదివరకు అమ్రాబాద్ తండా సహా సుమారు 11 నివాస ప్రాంతాలకు మిషన్ భగీరథ పైప్లైన్లు ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రస్తుతం ఆప్రాంతాలకు మిషన్ భగీరథ జలాలు అందించేందుకు వీలుగా అనువైన పరిస్థితులను పరిశీలించేందుకు కలెక్టర్ క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. తాగునీటి అవసరాల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పూర్తిగా బోరుబావుల పైనే ఆధారపడి జీవనాలు వెళ్ళదీస్తున్నామని ఈ సందర్భంగా స్థానిక గిరిజనులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీంతో మిషన్ భగీరథ నీటి సరఫరా కోసం సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని నివాస ప్రాంతాలకు రక్షిత మంచినీరు సరఫరా జరిగేలా అనుకూలమైన ప్రదేశంలో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మించాలని సూచించారు. నిర్దేశిత ప్రాంతాలకు తాగునీటి సరఫరాను అందుబాటులోకి తెచ్చి జల్ జీవన్ మిషన్ కింద కవర్అయ్యేలాచూడాలన్నారు. కాగా, ఎల్ నినో ప్రభావం వల్ల ఆశించిన రీతిలో వర్షాలు కురియక నీటి నిల్వలు అంతంతమాత్రంగానే అందుబాటులో ఉన్నాయని, భూగర్భ జలమట్టం సైతం దిగువకు పడిపోయినందున ఖరీఫ్ లో ఆరుతడి పంటలే సాగు చేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా స్థానిక రైతులకు సూచించారు.వరికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే పప్పుదినుసులు, మొక్కజొన్న, జొన్న వంటి పంటలను సాగు చేయాలని హితవు పలికారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ రాజేంద్రకుమార్, మిషన్ భగీరథ ఈ.ఈ రాకేష్, మోపాల్ తహసిల్దార్ రేఖ, స్థానిక సర్పంచ్ ప్రియాంక తదితరులు ఉన్నారు.

మహిళలు , బాలికల
భద్రత పై అత్యంత ప్రాధాన్యం
సమీక్ష సమావేశం లో అదనపు డీసీపీ (అడ్మిన్)శుభం ప్రకాష్



నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 16 (డీకే చాటింపు):మహిళల రక్షణ , భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలనీ మహిళల భద్రత , రక్షణ , సంక్షేమానికి సంబంధించిన వివిధ విభాగాల అధికారులతో శుక్ర వారం అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్ సమీక్ష సమావేశం నిర్వహించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో షీ టీమ్స్ , భరోసా సెంటర్ , యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ , గృహ హింస నిరోధక విభాగం , మిస్సింగ్ ఉమెన్ , మహిళా సహాయ విభాగాలు , ఉమెన్ హెల్ప్ డెస్క్ తదితర విభాగాల పనితీరును సమీక్షించారు. ఆయా విభాగాల ద్వారా మహిళలు , బాలికలకు అందిస్తున్న సేవలు , అందిన ఫిర్యాదులు , వాటిపై తీసుకుంటున్న చర్యలు , పరిష్కారం కాని కేసుల పురోగతి తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసు కున్నారు.మహిళలు , బాలికలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల అధికారులు సత్వరమే స్పందించాలని , బాధితులకు భరోసా కల్పిస్తూ వారికి న్యాయం జరిగేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మహిళలపై వేధింపులు , గృహ హింస , మానవ అక్రమ రవాణా వంటి నేరాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలని , బాధితుల ఫిర్యాదులను సున్నితంగా స్వీకరించి చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. షీ టీమ్స్ ద్వారా మహిళలు , బాలికలకు భద్రతపై అవగాహన కల్పిస్తూ , వేధింపులకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. భరోసా సెంటర్ ద్వారా బాధిత మహిళలకు అవసరమైన సహాయం , కౌన్సెలింగ్ , సంబంధిత శాఖల సమన్వయంతో తగిన సేవలు అందించాలని సూచించారు. అలాగే , మహిళా పోలీస్ స్టేషన్లు , ఉమెన్ హెల్ప్ డెస్క్‌లకు వచ్చే ఫిర్యాదులపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని , ప్రతి ఫిర్యాదును బాధ్యతా యుతంగా పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాల ని తెలిపారు. మహిళలు , బాలికలకు సురక్షిత వాతావరణం కల్పించడమే లక్ష్యంగా అన్ని సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్ అధికారులకు సూచించారు.సమావేశంలో సి.సి.ఆర్.బి ఏసిపి గురు నాయుడు, మహిళా పోలీస్ స్టేషన్ సిఐ ప్రసాద్ , సి.సి.ఎస్ సి.ఐ సురేష్ , షీ టీం మహిళా ఎస్సై స్రవంతి మరియు సంబంధిత విభాగల అధికారులు పాల్గొన్నారు.

కోటగిరిలో 2రోజుల శతచండి యాగం





నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 16(డీకే చాటింపు):సార్వజనిక దేవి నవరాత్రుల లో భాగంగా శుక్రవారం సామూహిక 2 రోజుల శతచండి యాగం ప్రారంభం అయ్యింది. వేదపండితులు, ఘనాపాటీలు మంత్రోచ్ఛరణ లతో ప్రాంగణం మారు మోగింది.శతచండీయాగానికి శతాదికుడైన బ్రహ్మశ్రీ నాగనాథ్ శాస్త్రినీ నిర్వాహ కులు ఆహ్వానించారు.శత చండీయాగం ప్రారంభానికి సూచికగా గ్రామ దేవతలకు పూజలు నిర్వహించారు.

నగరేశ్వర మందిర్ లో బతుకమ్మ పండుగ



నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 16(డీకే చాటింపు):నగరేశ్వర మందిరంలో కోటగిరి ఆర్యవైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. బతుకమ్మల తయారీలో గునుక పువ్వు తంగేడి పువ్వు వివిధ రకాల పూలతో అందంగా అలంకరించి పండుగను మహిళలు ఘనంగా జరుపుకున్నారు. నగరేశ్వర మందిరంలోని పార్వతి అమ్మవారికి ఓడిబియ్యం సారెలు సమర్పించారు. అతి పురాతనమైన నగరేశ్వర మందిరం అభివృద్ధికి సంఘం ప్రతినిధులు తోడ్పాటు అందిస్తున్నారు. మందిరంలో ఇటీవల సిమెంట్ రోడ్డు వేయించారు.

శ్రీ మాత దుర్గాదేవి సమితి ఆధ్వర్యంలో కుంకుమార్చన



నిజామాబాద్ ప్రతినిధి,అక్టోబర్ 16,(డీకే చాటింపు):నిజామాబాద్ నగరంలోని శ్రీమాతా దుర్గాదేవి సమితి వివేకానంద నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన కార్యక్రమం ఘనంగా చేశారు. ప్రముఖ పండితులు యాల్లప్రగడ చంద్రశేఖర్ శర్మ కుంకుమ పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు యాల్లప్రగడ చంద్రశేఖర్ శర్మ మాట్లాడుతూ దుర్గాదేవిని భక్తిశ్రద్ధలతో పూజించిన వారికి సకల సంపదలు ఆయురారోగ్యము లభిస్తుందని అన్నారు అధ్యక్షులు అట్లూరి మురళీకృష్ణ మాట్లాడుతూ దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గా దేవికి విశేష పూజ కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో సహకరిస్తున్న కాలనీ సభ్యులకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చెరుకు లక్ష్మణ్ గౌడ్ మాట్లాడుతూ 15 సంవత్సరాలుగాదుర్గాదేవి ని పూజిస్తున్నామని ఈ మండపం వద్ద దుర్గాదేవిని పూజించిన ప్రతి ఒక్కరికి సంతానం ఉద్యోగం జీవిత సౌఖ్యం అనుకున్న కోరికలు నెరవేరుతున్నాయని ఆయన తెలిపారు గౌరవ అధ్యక్షులు మారోజుకిషన్ ,ఉపాధ్యక్షులు, కార్యవర్గ వివేకానంద కాలనీ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గౌడ హాస్టల్ భవనం ప్రారంభం





డీకే చాటింపు ప్రతినిధి, (సంగారెడ్డి):సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామంలో శుక్రవారం గౌడ హాస్టల్ భవన ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు.గౌడ హాస్టల్ భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గౌడ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీ బంగారు మైసమ్మ దేవాలయంలో చండీ యాగ హోమం
పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి (డీకే చాటింపు)పట్టణంలోని కన్నాల నేషనల్ హైవే సమీపంలో ఉన్న శ్రీ బంగారు మైసమ్మ దేవాలయంలో శుక్రవారం నిర్వహించిన చండీ యాగ హోమం కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు దుర్గం చిన్నయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గెల్లి రాజలింగు, కుమారస్వామి,బీఆర్ఎస్ అధ్యక్షులు నూనేటి సత్యనారాయణ, పట్టణ యువజన అధ్యక్షులు సబ్బని అరుణ్ కుమార్, సీనియర్ నాయకులు సుందర్ రావు,కలాలి నర్సయ్య, టీబిజికేఎస్ నాయకులు శ్రీనివాసరావు, అనుముల సత్యనారాయణ,తదితర నాయకులు పాల్గొన్నారు.



ఎలన్ మస్క్ రోజు సంపద రూ.8,300 కోట్లు...



టెక్ దిగ్గజం, టెస్లా సిఇఒ ఎలాన్ మస్క్ సంపాదనలో కొత్త రికార్డ్‌లను నమోదు చేస్తున్నారు. 2025 జులై నుంచి 2026 జులై మధ్య కాలంలో ఆయన రోజుకు సగటున రూ.8,300 కోట్ల (875 మిలియన్ డాలర్లు)కు పైగా సంపాదించినట్లు 'బెస్ట్ బ్రోకర్స్' నిర్వహించిన అధ్యయనం వెల్లడించింది. ఈ ఏడాది కాలంలోనే ఆయన వ్యక్తిగత సంపద ఏకంగా 320 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.30 లక్షల కోట్లు) పెరిగింది. ఈ క్రమంలోనే 2026 జూన్ 12న తన ఆధ్వర్యంలోని స్పేస్‌ఎక్స్ సంస్థ స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టిన వేళ, మస్క్ ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్గా (1 లక్ష కోట్ల డాలర్లు లేదా రూ.95 లక్షల కోట్లకు పైగా సంపద కలిగిన వ్యక్తి) అవతరించారు. అయితే తదుపరి నెలలో స్పేస్‌ఎక్స్ షేర్లు తీవ్ర క్షీణతకు గురవ్వడంతో ఆయన ఆ హోదాను కోల్పోయినప్పటికీ, అంతర్జాతీయ కుబేరుల జాబితాలో అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. ఎలాన్ మస్క్ తర్వాత అత్యంత వేగంగా ధనాన్ని ఆర్జించిన పారిశ్రామికవేత్తల్లో డెల్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు, సిఇఒ మైఖేల్ డెల్ నిలిచారు. 2025 జులై నుంచి 2026 జులై మధ్య ఆయన సంపద 107.6 బిలియన్ డాలర్ల మేర పెరిగింది. అదేవిధంగా ఎఐ ప్రభంజనంతో చైనాకు చెందిన ఏఐ స్టార్టప్ డీప్‌సీక్ వ్యవస్థాపకుడు లియాంగ్ వెన్‌ఫెంగ్ సంపద 39.5 బిలియన్ డాలర్ల మేర పెరగడంతో ఆయన ప్రపంచంలోని టాప్-50 అత్యంత ధనవంతుల జాబితాలో స్థానం సంపాదించుకున్నారు. మైఖేల్ డెల్, లియాంగ్ వెన్‌ఫెంగ్ తో పాటు లారీ పేజ్, సెర్గీ బ్రిన్, గియాన్‌కార్లో వంటి ప్రముఖ టెక్ దిగ్గజాలు కూడా ఈ ఎఐ వృద్ధి ద్వారా సంపదను విపరీతంగా పెంచుకున్నారు. 2025 జులై నుంచి 2026 జులై మధ్య కాలంలో ఆయన రోజుకు సగటున రూ.8,300 కోట్ల (875 మిలియన్ డాలర్లు)కు పైగా సంపాదించినట్లు 'బెస్ట్ బ్రోకర్స్' నిర్వహించిన అధ్యయనం వెల్లడించింది. ఈ ఏడాది కాలంలోనే ఆయన వ్యక్తిగత సంపద ఏకంగా 320 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.30 లక్షల కోట్లు) పెరిగింది.

రష్యా నుంచి రికార్డ్ స్థాయి చమురు దిగుమతులు



అమెరికా ఆంక్షలు తీవ్రమవుతున్నప్పటికీ రష్యా నుంచి తక్కువ ధరలకు లభించే ముడి చమురును భారత్ భారీగా దిగుమతి చేసుకుం టోంది. నెలలో రష్యన్ క్రూడాయిల్ దిగుమతులు వరుసగా రెండో నెలలోనూ రికార్డు స్థాయిని తాకాయి. ప్రముఖ స్వచ్ఛంద పరిశోధనా సంస్థ 'సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ (సిఆర్ఇఎ)' నివేదిక ప్రకారం.. నెలలో భారతీయ రిఫైనరీలు రష్యా నుంచి ఏకంగా 5.5 బిలియన్ యూరోల (దాదాపు రూ.50,000 కోట్లకు పైగా) విలువైన ముడిచమురును కొనుగోలు చేశాయి.

ఇది జూన్ నెలతో పోలిస్తే పరిమాణం పరంగా 2.1 శాతం అధికం కావడం గమనార్హం. ఈ ఏడాది జులైలో రష్యా నుంచి భారత్ దిగుమతి చేసుకున్న మొత్తం ఇంధనాల్లో ఒక్క ముడిచమురు వాటానే 87 శాతంగా నమోదైంది. జులైలో రష్యా నుంచి వచ్చిన రోజువారీ సగటు దిగుమతులు 28 లక్షల బారెళ్లకు పెరిగాయి.

ఆ నెలలో భారత్ చేసుకున్న మొత్తం చమురు దిగుమతుల్లో (దాదాపు 50 లక్షల బారెళ్లు) రష్యా వాటా ఏకంగా 55.5 శాతానికి చేరడం విశేషం. ఉక్రెయిన్ యుద్ధానికి ముందు 2021లో భారత్ రోజుకు కేవలం 1 లక్ష బారెళ్ల లోపు రష్యన్ చమురును మాత్రమే కొనుగోలు చేసేది. 2022 నాటికి ఇది 7.40 లక్షల బారెళ్లకు, 2023లో 18 లక్షల బారెళ్లకు పెరగ్గా, ప్రస్తుతం రికార్డు స్థాయిలో 28 లక్షల బారెళ్లకు చేరింది. దీంతో చైనా తర్వాత రష్యా నుంచి అత్యధికంగా చమురు కొనుగోలు చేస్తున్న రెండో అతిపెద్ద దేశంగా భారత్ నిలిచింది.

త్వరలో యాపిల్ పే సేవలు!



భారత్‌లో డిజిటల్ చెల్లింపుల మార్కెట్‌లోకి అడుగుపెట్టేందుకు గ్లోబల్ టెక్ దిగ్గజం యాపిల్ సిద్ధమవుతున్నట్లు సమాచారం. తాజా నివేదికల ప్రకారం, సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో యాపిల్ పేను భారత్‌లో ప్రారంభించే అవకాశాలపై కంపెనీ పనిచేస్తోంది. తొలి దశలో కంపెనీ వీసా, మాస్టర్‌కార్డ్ నెట్‌వర్క్‌లలోని ప్రీమియం క్రెడిట్ కార్డ్‌లకు మాత్రమే మద్దతు ఇవ్వనుంది. దీని ద్వారా ఐఫోన్ లేదా ఐప్యాడ్ వినియోగదారులు తమ క్రెడిట్ కార్డ్‌లను యాపిల్ వ్యాలెట్‌కు అనుసంధానించి, షాపుల్లోని స్వైపింగ్ మెషిన్ల (పీఓఎస్) వద్ద ఎన్ఎఫ్‌సీ (ఎన్ఎఫ్‌సీ) టెక్నాలజీతో కాంటాక్ట్‌లెస్ చెల్లింపులు చేయవచ్చు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ), స్పాన్సర్ బ్యాంకుల నుండి ప్రత్యేక అనుమతులు పొందాల్సి ఉన్నందున, ప్రారంభంలో యూపీఐ (యూపీఐ) సేవలు అందుబాటులో ఉండవని సమాచారం. ఈ నేపథ్యంలోనే దేశంలోని ప్రధాన కార్డు జారీ చేసే బ్యాంకులతో యాపిల్ చర్చలు జరుపుతున్నట్లు నివేదికలు పేర్కొన్నాయి. ముఖ్యంగా, ప్రతి లావాదేవీపై 15?20 బేసిస్ పాయింట్ల ఫీజును యాపిల్ కోరుతున్నట్లు సమాచారం. అయితే కొన్ని బ్యాంకులు దీనిని 10 బేసిస్ పాయింట్లకు పరిమితం చేయాలని చూస్తున్నాయి. ఈ ఫీజును వినియోగదారులు లేదా వ్యాపారులపై నేరుగా వేయకుండా, బ్యాంకులు పొందే ఇంటర్‌ఛేంజ్ ఆదాయం నుంచి చెల్లించే విధానంపై చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

పసిడిపై కస్టమ్స్ సుంకాల భారీ రాబడి...!



కేంద్ర ప్రభుత్వం తీసుకున్న దిగుమతి సుంకాల సవరణ నిర్ణయం సామాన్య,మధ్యతరగతి వినియోగదారులపై తీవ్ర భారాన్ని మోపింది. బంగారం, వెండి, ప్లాటినం దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని భారీగా పెంచడంతో దాదాపు మూడు నెలల వ్యవధిలోనే పసిడి కొనుగోలుదారుల జేబుల నుంచి కేంద్ర ఖజానాకు ఏకంగా రూ.10,463 కోట్ల అదనపు ఆదాయం వచ్చి చేరింది. లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి లిఖితపూర్వక సమాధానమిస్తూ.. అంతర్జాతీయ ప్రతికూల పరిణామాల నేపథ్యంలో దేశంలో బంగారం, వెండి కొనుగోళ్లను నిరుత్సాహపరిచి, విదేశీ మారకాన్ని కాపాడాలనే వ్యూహంతో ప్రభుత్వం మే 13న కస్టమ్స్ సుంకాలను సవరించిందన్నారు. బంగారం, వెండిపై అప్పటివరకు 6 శాతంగా ఉన్న కస్టమ్స్ డ్యూటీని ఏకంగా 15 శాతానికి పెంచగా, ప్లాటినంపై 6.4 శాతం నుంచి 15.4 శాతానికి పెంచింది. దీంతో దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు ఒక్కసారిగా రికార్డు స్థాయికి చేరి, పెళ్లిళ్ల సీజన్‌లో ఆభరణాల కొనుగోలుదారులపై, సామాన్య ప్రజలపై విపరీతమైన ఆర్థిక భారం పడింది.

ర్యాలీలో పెల్లెట్ గన్ కాల్పులు 10 మందికి గాయాలు..!

న్యూఢిల్లీ :ర్యాలీలో పెల్లెట్ గన్ కాల్పుల కారణంగా సుమారు 10 మంది గాయపడినట్లు ఆర్‌టిఐ నివేదిక తెలిపింది. రెండు ఆసుపత్రులు ఇచ్చిన ఈ వివరాలను టిఎంసి ప్రతినిధి సాకేత్ గోఖలే 'ఎక్స్' పోస్ట్‌లో వెల్లడించారు. ఢిల్లీలోని లేడీ హార్డింజ్ మెడికల్ కాలేజ్ ఆసుపత్రి ఇచ్చిన ఆర్‌టిఐ సమాధానంలో పెల్లెట్ల వల్ల తొమ్మిది మంది గాయపడినట్లు పేర్కొంది. ఈ సమాచారాన్ని ఆసుపత్రి వర్గాలు కూడా ధ్రువీకరించినట్లు తెలుస్తోంది. మరోవైపు సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి తన సమాధానంలో ఒక వ్యక్తి పెల్లెట్ గాయాలతో చికిత్స పొందినట్లు తెలిపింది. జులై 20న జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసన సందర్భంగా పెల్లెట్ గన్‌లను ఉపయోగించినట్లు మొదట ఢిల్లీ పోలీసులు ఖండించారు. అయితే జులై 22న పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన జనరల్ డైరీ ఎంట్రీలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) అల్లర్ల నియంత్రణ తుపాకీతో రెండు రౌండ్లు కాల్పులు జరిపినట్లు నమోదైనట్లు సమాచారం. పెల్లెట్ గాయాలైన వారిలో 25 ఏళ్ల కళాకారుడు ప్రశాంత్ కుమార్ సింగ్, 25 ఏళ్ల షేక్ ఇర్షాద్ మన్సూరీ, 19 ఏళ్ల విద్యార్థి సాహిల్ లోచబ్, ఒక పాత్రికేయుడు ఉన్నారు. మరోవైపు 32 ఏళ్ల నూతన్ అనే మహిళ 'మొద్దుబారిన ఆయుధం'తో గాయపడినట్లు వైద్య నివేదికలు పేర్కొన్నాయి. ఇప్పటివరకు జరిగిన నిరసనల్లో పెల్లెట్ గన్ గాయాల సంఖ్య ఐదుగా వార్తలు వచ్చాయని సాకేత్ గోఖలే తెలిపారు. అయితే ఆసుపత్రుల నుంచి సేకరించిన రికార్డుల ప్రకారం నిర్ధారిత సంఖ్య సుమారు 10 మందికి చేరిందని ఆయన పేర్కొన్నారు.

ఈపీఎఫ్ఓ అలర్ట్.. నకిలీ లింక్‌లతో జాగ్రత్త



ఆన్‌లైన్‌లో ఈపీఎఫ్ సేవలు ఉపయోగించే చందాదారులకు ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) కీలక హెచ్చరిక జారీ చేసింది. ఈపీఎఫ్ఓ పేరుతో నకిలీ వెబ్‌సైట్‌లు, లింక్‌లు, ఎస్సెమ్మెస్‌లు, ఈ-మెయిళ్లు, సోషల్ మీడియా మెసేజ్‌ల ద్వారా మోసాలకు పాల్పడే అవకాశం ఉందని తెలిపింది. ఏవైనా అనుమానాస్పద లింక్స్‌ను 'క్లిక్ చేసే ముందు ఆలోచించండి' అంటూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ పోస్టులో చందాదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈపీఎఫ్ఓ సేవలను కేవలం అధికారిక వెబ్‌సైట్‌లు, పోర్టల్‌ల ద్వారానే పొందాలని స్పష్టం చేసింది. లాగిన్ చేసే ముందు వెబ్‌సైట్ యూఆర్ఎల్‌ను జాగ్రత్తగా పరిశీలించాలని, అక్షరదోషాలు లేదా అసాధారణ డొమైన్ పేర్లు కనిపిస్తే వెంటనే వాటిని నివారించాలని సూచించింది. ముఖ్యంగా యూఏఎన్, పీపీఓ, ఆధార్, పాన్, బ్యాంక్ ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీల వంటి సున్నితమైన సమాచారాన్ని అధికారిక ఈపీఎఫ్ఓ పోర్టల్‌లు మినహా మరెక్కడా ఇవ్వొద్దని సంస్థ హెచ్చరించింది. ఈపీఎఫ్ఓ ఎప్పుడూ ఫోన్ కాల్, వాట్సాప్, ఎస్సెమ్మెస్, సోషల్ మీడియా లేదా ఈ-మెయిల్ ద్వారా చందాదారుల నుంచి ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు లేదా లాగిన్ వివరాలు అడగదని స్పష్టం చేసింది.

అవి దేశద్రోహ డిమాండ్లా?

సిరా చల్లడం క్షణంలో జరిగిపోయే పని. ముఖం నల్లబడుతుంది, బట్టలకు మరక పడుతుంది. కొద్దిసేపటి తర్వాత ఆ మరకను కడిగేయవచ్చు. కానీ ప్రజాస్వామ్యంలో ఒకరి ముఖంపై పడిన సిరా వెనుక ఉన్న ప్రశ్నను మాత్రం అంత సుల భంగా తుడిచేయలేం. జార్ఖండ్‌లో ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎఐఎస్ఏ) జాతీయ అధ్యక్షురాలు నేహా బోరాపై జరిగిన సిరా దాడి అలాంటి ఘటనే. ఇది ఒక విద్యార్థి నాయకురాలిని అవమానించడం మాత్రమే కాదు. నిరసన తెలిపే హక్కును, రాజ్యాంగాన్ని కూడా. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్సీ), జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జేఎస్ఎస్సీ) సీజీఎల్ పరీక్షల్లో అవకతవకలు, పేపర్ లీకేల ఆరోపణలపై ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ లాంటి వామపక్ష విద్యార్థి సంఘాలతో కొద్దిరోజులుగా విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. జేపీఎస్సీని పునర్వ్యవస్థీకరించాలని, జేఎస్ఎస్సీ సీజీఎల్ పరీక్షలను రద్దు చేసి కొత్త షెడ్యూల్ ప్రకటించాలని, ప్రయివేటు ఏజెన్సీల ద్వారా పరీక్షలు నిర్వహించకూడదని, నియామకాల్లో పారదర్శకత ఉండాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఉద్యమానికి మద్దతుగా నిలిచిన నేహా బోరా రాంచీలో నిర్వహించిన శాంతియుత ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ బిర్సా చౌక్ సమీపానికి చేరుకున్న సమయంలో గుంపులో నుంచి అరెస్సెస్ మద్దతుదారునిగా అనుమానిస్తున్న ఓ వ్యక్తి నేహా బోరాతో పాటు కొందరు మహిళా నాయకు రాళ్లపై సిరా చల్లాడు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా 'నేహా దేశద్రోహి. ఉమర్ ఖలీద్‌కు మద్దతిస్తోంది' అని తెలిపాడు. ఉమర్ ఖలీద్ పీహెచ్‌డీ విద్యార్థి, జేఎన్‌యూ నాయకుడు. క్యాంపస్‌లో జరిగిన ఒక నిరసన ప్రదర్శనలో దేశద్రోహ వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో ఆయన మొదటిసారి వార్తల్లోకి వచ్చారు. పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ), ఎన్ఆర్‌సికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలో చురుగ్గా పాల్గొన్నారు. 2020లో ఈశాన్య ఢిల్లీలో జరిగిన అల్లర్లకు వెనుక కుట్ర పన్నారని ఆరోపిస్తూ, ఢిల్లీ పోలీసులు ఆయనపై చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం ఉపా కింద జైల్లో నిర్భందించారు. ఆయన పాకిస్థాన్ ఏజెంట్ కాదు, దేశద్రోహి అంతకన్నా కాదు. ఎవరైనా నేహ రాజకీయ భావజాలాన్ని వ్యతిరేకించవచ్చు, ఆమె డిమాండ్లతో విభేదించవచ్చు, ఆమెను విమర్శించవచ్చు. కానీ ప్రజాస్వామ్యంలో ప్రత్యామ్నాయ సమాధానం వాదన కావాలి, దాడి కాదు. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం దేశద్రోహం కాదు. పరీక్షల్లో పారదర్శకత కోరడం దేశద్రోహం కాదు. ఉద్యోగాల కోసం పోరాడుతున్న విద్యార్థుల పక్షాన నిలబడటం దేశద్రోహం కాదు. దేశం అంటే ప్రభుత్వం మాత్రమే కాదు. దేశం అంటే ప్రజలు. దేశం అంటే విద్యార్థులు. దేశం అంటే యువత భవిష్యత్తు.నేహా బోరా గతంలోనూ విద్యార్థుల సమస్యలపై ఉద్యమించారు. నీట్ పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన ఉద్యమంలో పాల్గొన్నారు. సోనమ్ వాంగ్‌చుక్‌తో కలిసి 23 రోజుల నిరవధిక నిరాహార దీక్షలోనూ ఉన్నారు. విద్యార్థి సమస్యలు, విద్యా సంస్కరణలు, సామాజిక న్యాయం వంటి అంశాలపై ఆమె చురుకుగా పనిచేస్తున్నారు.సిరా దాడి తర్వాత కూడా భయపడబోనని, విద్యార్థుల భవిష్యత్తు కోసం పోరాటం కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు.

అయితే అసలు సమస్య మాత్రం విద్యార్థుల ప్రశ్నలకు సమాధానం ఇవ్వడమే. పరీక్షల్లో నిజంగా అవకతవ కలు జరిగితే చర్యలు తీసుకోవాలి. ఆరోపణలు నిజం పారదర్శకతను నిర్ధారించాలి. ప్రజాస్వామ్యం అంటే ఐదేళ్లకోసారి ఓటు వేయడం మాత్రమే కాదు. ప్రశ్నించడం, నిరసించడం, ప్రభుత్వ నిర్ణయాలను విమర్శించడం, ప్రత్యామ్నాయాన్ని ప్రతిపాదిం చడం కూడా ప్రజాస్వా మ్యంలో భాగమే. జేపీఎస్సీని పునర్వ్యవస్థీకరించాలని, జేఎస్ఎస్సీ సీజీఎల్ పరీక్షలను రద్దు చేసి కొత్త షెడ్యూల్ ప్రకటించాలని, ప్రయి వేటు ఏజెన్సీల ద్వారా పరీక్షలు నిర్వహించకూడదని, నియామకాల్లో పారదర్శకత ఉండాలని వారు డిమాండ్‌చేస్తున్నారు. ఈ ఉద్యమానికి మద్దతుగా నిలిచిన నేహా బోరా రాంచీలో నిర్వహించిన శాంతియుత ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ బిర్సా చౌక్ సమీపానికి చేరుకున్న సమయంలో గుంపులో నుంచి అరెస్సెస్ మద్దతుదారునిగా అనుమానిస్తున్న ఓ వ్యక్తి నేహా బోరాతో పాటు కొందరు మహిళా నాయకు రాళ్లపై సిరా చల్లాడు.

ట్రంప్‌కు 'ట్రూత్' కష్టాలు.. రూ.2వేల కోట్ల నష్టం!



అమెరికాఅధ్యక్షుడు ట్రంప్‌నకు సంబంధించిన సోషల్ మీడియా ట్రూత్ భారీ నష్టాన్ని చవిచూసింది. ట్రూత్ సోషల్ మాతృ సంస్థ 'ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్' (ఓటీఉ)నకు రెండో త్రైమాసికంలో 238 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.2 వేల కోట్లు) నష్టం వాటిల్లింది. కంపెనీ ఫైలింగ్ ప్రకారం.. జూన్‌తో ముగిసిన ఈ త్రైమాసిక నష్టం.. గత ఏడాది నమోదైన నష్టం కంటే 10రెట్లు ఎక్కువ. సంస్థ ఆదాయం ఏడాది క్రితంతో పోలిస్తే రెట్టింపు కంటే ఎక్కువైనప్పటికీ.. నష్టం మాత్రం తప్పలేదు. డిజిటల్ కరెన్సీ మార్కెట్‌లో భారీ పతనం.. క్రిప్టో కరెన్సీ విలువలు పడిపోవడం వల్లే ఈ నష్టం సంభవించినట్లు పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈనష్టం నేపథ్యంలో భవిష్యత్తులో కొత్త వృద్ధి అవకాశాలను, వాటాదారుల విలువను పెంచే నూతన విధానాలపై దృష్టిపెట్టామని సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కెవిన్ మెక్‌గర్న్ వెల్లడించారు. ఆన్‌లైన్ బెట్టింగ్, క్రిప్టో వంటి కార్యక్రమాలను పక్కన పెట్టేసి మళ్లీ తమ దృష్టిని సోషల్ మీడియా వ్యాపారాలపై మళ్లించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.ట్రూత్ మీడియాలో కొత్త ఫీచర్లు తీసుకురావడానికి.. మరింత మంది వినియోగదారులకు దీనిని అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామన్నారు. చూడగలిగేలా వాల్ స్ట్రీట్ ట్రేడింగ్ సంస్థలకు ముందస్తు యాక్సెస్ ఇచ్చే ట్రూత్ ఏపీఐకు ఇకపై అధిక ప్రాధాన్యత ఇవ్వాలనిసంస్థ నిర్ణయించుకుంది. ఇందులో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పోస్ట్‌లను కూడా మిగిలిన వారికంటే ముందే చూసేలా యాక్సెస్ ఉంటుంది. అమెరికా ప్రభుత్వం తీసుకునే ప్రధాన నిర్ణయాలు, మార్పులు తరచుగా మార్కెట్లను ప్రభావితం చేసే అవకాశం ఉండటంతో.. ట్రేడింగ్ సంస్థలు దీనికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తాయి.

ఆరోగ్యానికి చిన్నపరీక్ష!



జెస్టేషనల్ డయాబెటిస్.. మహిళల్లో గర్భధారణ సమయంలో కనిపిస్తుంది. చాలామందిలో ప్రసవం తర్వాత తగ్గిపోతుంది. కానీ, మూడింట ఒకవంతు మంది మహిళలు.. డెలివరీ తర్వాత కూడా షుగర్ వ్యాధితో బాధపడుతున్నారట. ఈ క్రమంలో కాన్పు తర్వాత 'గ్లూకోజ్ టాలరెన్స్ టెస్ట్' చేయించుకోవాలని ఆరోగ్య నిపుణులు సలహా ఇస్తున్నారు. కానీ, చాలామంది మహిళలు ఈ పరీక్షలు చేయించుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. ప్రసవం తర్వాత పిల్లల కోసమే పూర్తి సమయాన్ని కేటాయిస్తూ.. తమ ఆరోగ్యాన్ని పట్టించుకోవడం లేదు. 'టాలరెన్స్ షుగర్ పరీక్ష'కు చాలామంది మహిళలు విముఖత చూపుతున్నారని తాజా పరిశోధన ఒకటి తేల్చింది. కెనడాకు చెందిన లునెన్‌ఫీల్డ్ – టానెన్‌బామ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ చేపట్టిన ఈ పరిశోధన వివరాలను 'డయాబెటిస్ కేర్' ప్రచురించింది. ఇందులో పేర్కొన్న వివరాల ప్రకారం.. 'గ్లూకోజ్ టాలరెన్స్' పరీక్ష చేయించుకోవాలంటే.. బాలింతలు రాత్రిపూట ఉపవాసం ఉండి, మరుసటి రోజు ఉదయం పరీక్షకు రావాల్సి ఉంటుంది. శాంపిల్ ఇచ్చిన తర్వాత.. ఆహారం తీసుకొని, మళ్లీ రెండు గంటలపాటు వేచి ఉండి, మరోసారి రక్తం శాంపిల్ ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో, ఎక్కువ సమయంపాటు వేచి చూడటం, రాత్రిపూట ఉపవాసం.. ఇలాంటి కారణాలతో మహిళలు ఈ పరీక్ష చేయించుకోవడానికి విముఖత చూపుతున్నారట. ఈ సమస్యను గుర్తించిన అంతర్జాతీయ డయాబెటిస్ సమాఖ్య.. ఈ పరీక్ష వ్యవధిని ఒక గంటకు తగ్గించాలని సిఫార్సు చేసింది. ఇలా, ఒక గంటలో పూర్తిచేసే పరీక్ష.. రక్తంలో చక్కెర స్థాయిలను కచ్చితంగా అంచనా వేస్తుందని పరిశోధనలో తేలింది. ఇందులో భాగంగా.. 369 మంది మహిళలను ఎంపికచేసింది. వీరిలో కొందరికి ప్రసవానంతరం రెండు గంటల టాలరెన్స్ టెస్ట్ చేయగా.. మరికొందరికి గంటలో పూర్తయ్యే పరీక్ష నిర్వహించారు. ఆశ్చర్యకరంగా.. రెండు రకాల పరీక్షల ఫలితాలు సరిపోలినట్టు పరిశోధకులు వెల్లడించారు. ఈ చిన్న పరీక్షతో భవిష్యత్తులో షుగర్ వ్యాధి ముప్పు నుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నారు.

వ్యర్థం కాదు.. బలం!



చెత్తబుట్టలో పడేసే వంటింటి వ్యర్థాలు.. పెరటి మొక్కలకు బలాన్ని ఇస్తాయి. సహజసిద్ధమైన ఎరువుగా పనిచేసి.. మొక్కలు ఏపుగా పెరిగేందుకు సాయపడతాయి. మట్టిసారాన్ని పెంచడంతోపాటు రసాయనాల ముప్పునూ తగ్గిస్తాయి. మరి.. మొక్కల ఎదుగుదలను ప్రోత్సహించే ఆ పదార్థాలేంటో తెలుసుకుందామా!.%శ్రీ% ఆరోగ్యానికి మేలుచేసే గ్రీన్ టీ.. మొక్కల ఎదుగుదలలోనూ ముందుంటుంది. వేడినీటిలో ముంచి పక్కన పడేసిన 'గ్రీన్ టీ' బ్యాగుల్లోని తేయాకును ఒక గిన్నెలోకి తీసుకోవాలి. ఇది మొక్కలకు సహజ ఎరువుగా పనిచేస్తుంది. దీన్ని అలాగే మొక్కల మొదళ్లలో వేస్తే సరిపోతుంది. దీంతోపాటు ఒక లీటర్ నీటిలో కొన్ని గ్రీన్ టీ బ్యాగులు వేసి.. కొన్ని గంటల పాటు నాననివ్వాలి. ఆ తర్వాత టీ బ్యాగులను బాగా పిండేసి.. ఆ నీటిని మొక్కలపై పిచికారీ చేయాలి. ఇలా చేస్తే.. మొక్కలు మరింత ఏపుగా పెరుగుతాయి. మొక్కలను చీడపీడల నుంచి కాపాడటంలో ఉల్లిపొట్టు కీలకపాత్ర పోషిస్తుంది. బయట పడేసే ఉల్లిపొట్టును మొక్కల పొదల్లో వేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది. ఐదు లీటర్ల గోరు వెచ్చని నీటిలో 20 – 30 గ్రా. ఉల్లిపొట్టు వేసి.. నాలుగు రోజులపాటు పక్కన ఉంచాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని మొక్కలపై పిచికారీ చేస్తే.. మొక్కలకు బలం వస్తుంది. తొక్కే కదా!' అని పారేసే అరటి తొక్కలోనూ.. మొక్కలకు అవసరమయ్యే పోషకాలు ఎన్నో ఉంటాయి. అరటిపండు తొక్కల్ని మొక్కల మొదళ్ల వద్ద వేసి.. దానిమీద కొద్దిగా మట్టిని కప్పాలి. కొన్నిరోజులకు ఆ తొక్కలు మట్టిలో కలిసిపోయి.. ఎరువుగా మారుతాయి. ముఖ్యంగా, పూల మొక్కలు విరివిగా పూసేందుకు ఈ ఎరువు అద్భుతంగా పనిచేస్తుంది.

వాల్ నట్స్‌ను రోజూ తింటే ఎన్ని పోషకాలు లభిస్తాయో తెలుసా..?



మన శరీరానికి పోషకాలను అందించే ఎన్నో రకాల ఆహారాలు మనకు అందుబాటులో ఉన్నాయి. ఎవరైనా సరే తమ ఇష్టాలు, అభిరుచులకు అనుగుణంగా, తమ స్థోమతను బట్టి ఆయా ఆహారాలను తింటుంటారు. అయితే పోషకాల విషయానికి వస్తే మనకు నట్స్ ఎంతో దోహదం చేస్తాయని చెప్పవచ్చు. నట్స్‌లో వాల్ నట్స్ మనకు ఎక్కువ లాభాలను అందిస్తాయి. కానీ జీడిపప్పు, బాదంపప్పు అంటే చాలా మందికి ఇష్టంగా ఉంటుంది. వాల్ నట్స్ ను వాటి రుచి కారణంగా చాలా మంది తినరు. అయినప్పటికీ వీటిల్లోనే పోషకాలు అధికంగా ఉంటాయి. వాల్ నట్స్‌ను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వాల్ నట్స్‌ను రోజూ నానబెట్టి తినాలని వారు సూచిస్తున్నారు. వాల్ నట్స్‌లో మన శరీరానికి అవసరం అయ్యే అనేక పోషకాలు ఉంటాయి.

అధిక బరువు తగ్గుతారు..: వాల్ నట్స్‌లో ఆల్ఫా-లినోలీనిక్ యాసిడ్ (ఆలా) అనే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. హార్ట్ ఎటాక్ రాకుండా చూస్తాయి. అలాగే మెదడు పనితీరును మెరుగు పరుస్తాయి. మెదడు యాక్టివ్‌గా పనిచేసేలా చేస్తాయి. వాల్ నట్స్‌లో ప్రోటీన్ల కూడా సమృద్ధిగానే ఉంటాయి. ఇవి శరీర కణజాలాన్ని పునర్నిర్మించేందుకు సహాయ పడతాయి. కణజాలం మరమ్మత్తులకు గురై ఆరోగ్యంగా ఉంటుంది. కణజాలం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ వాల్ నట్స్‌ను తీసుకోవాలి. వాల్ నట్స్‌లో ఫైబర్ కూడా అధికంగానే ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. దీంతో బరువు కూడా నియంత్రణలో ఉంటుంది. అధిక బరువును సులభంగా తగ్గించుకోవచ్చు. కొవ్వు కరుగుతుంది. ముఖ్యంగా పొట్ట దగ్గర ఉన్న కొవ్వు తొలగిపోతుంది.

చర్మ సంరక్షణకు..: వాల్ నట్స్‌లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. వీటిల్లో విటమిన్ ఇ ఎక్కువగా ఉంటుంది. ఇది యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటుంది. అందువల్ల ఫ్రీ ర్యాడికల్స్ నిర్మూలించబడతాయి. దీంతో కణాలు డ్యామేజ్ అవకుండా ఆరోగ్యంగా ఉంటాయి. వాల్ నట్స్‌ను తింటే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. చర్మం కాంతివంతంగా మారి తేమగా ఉంటుంది. మృదువుగా మారుతుంది. ఎల్లప్పుడూ యవ్వనంగా కనిపిస్తారు. వృద్ధాప్య ఛాయలు దరిచేరవు. ముఖంపై ఉండే ముడతలు, మచ్చలు పోతాయి. వాల్ నట్స్‌లో ఫోలేట్ (విటమిన్ బి9) అధికంగా ఉంటుంది. ఇది డీఎన్ఏ ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. ఎర్ర రక్త కణాలు తయారయ్యేందుకు దోహదం చేస్తుంది. కనుక వాల్ నట్స్‌ను గర్భిణీలు తింటే శిశువులకు కూడా ఎంతో మేలు జరుగుతుంది. వారిలో పుట్టుక లోపం రాకుండా చూడవచ్చు.

కండరాల పనితీరుకు..: వాల్ నట్స్‌లో మెగ్నిషియం అధికంగా ఉంటుంది. ఇది కండరాల పనితీరును మెరుగు పరుస్తుంది. కండరాల నొప్పులను తగ్గిస్తుంది. నాడీ మండల వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి. రాత్రి పూట కాలి పిక్కలు పట్టుకుపోయే సమస్య ఉన్నవారు రోజూ వాల్ నట్స్‌ను తింటుంటే ప్రయోజనం ఉంటుంది. అలాగే వాల్ నట్స్‌లో ఉండే మెగ్నిషియం ఒత్తిడి, ఆందోళనను తగ్గిస్తుంది. దీని వల్ల మైండ్ రిలాక్స్ అయి రాత్రి పూట చక్కగా నిద్ర పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. వాల్ నట్స్‌లో అధికంగా ఉండే ఫాస్ఫరస్ ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతుంది. వాల్ నట్స్‌ను రోజూ తినడం వల్ల వృద్ధాప్యంలో ఆస్టియోపోరోసిస్, ఆర్థరైటిస్ వంటి ఎముకల సంబంధిత సమస్యలు రాకుండా చూసుకోవచ్చు. ఇలా వాల్ నట్స్‌ను రోజూ తింటే అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

అందానికి ఆహారం



అందాన్ని కాపాడుకోవడం.. కొంచెం కష్టంగానే ఉంటుంది. ముఖ్యంగా చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే.. అదనపు జాగ్రత్తలు తీసుకోవాల్సి వస్తుంది. అయితే, బయటినుంచి ఎన్ని క్రీములు రాసినా, ఎంత మెరుగులు దిద్దినా మండే ఎండల్లో వ్యర్థమే అవుతుంది. సరైన ఆహారం తీసుకున్నప్పుడే.. వన్నె తగ్గని అందం సొంతమవుతుంది. ఈ క్రమంలో చర్మ సంరక్షణలో కొన్ని ముఖ్యమైన అంశాలను అందించే ఆహారాన్ని తీసుకోవాలని సౌందర్య నిపుణులు చెబుతున్నారు. హైడ్రేషన్: వేసవిలో చర్మం హైడ్రేటెడ్‌గా ఉండాలంటే.. అవకాడో, పుచ్చకాయలు, దోసకాయలు, స్వీట్ పొటాటో, టమాటా, గ్రీన్ టీ.. తీసుకోవడం మంచిది. అవకాడోలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్లు, విటమిన్లు.. శరీరానికి మరింత శక్తినిస్తాయి. ఇందులోని యాంటి ఏజింగ్ లక్షణాలు.. చర్మం ముడతలు పడకుండా కాపాడతాయి. స్వీట్ పొటాటో.. నేచురల్ సన్‌బ్లాక్‌గా పనిచేస్తుంది. చర్మాన్ని కాంతిమంతంగా మారుస్తుంది. ఇందులో అధిక మొత్తంలో లభించే బీటా కెరోటిన్.. చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. పుచ్చకాయలు, దోసకాయలు అధిక శాతం నీటితో నిండి ఉంటాయి. ఇవి చర్మాన్ని హైడ్రేట్ చేయడంతోపాటు ఇన్‌ఫ్లమేషన్, చికాకును తగ్గిస్తాయి. వడదెబ్బ వల్ల కలిగే నొప్పిని నివారిస్తాయి. విటమిన్లు: వేసవిలో దెబ్బతిన్న చర్మం మళ్లీ మెరుగ్గా మారాలంటే.. ఆహారంలో విటమిన్లు అధికంగా ఉండేలా చూసుకోవాలి. కొలాజెన్ ఉత్పత్తి కోసం ఆహారంలో విటమిన్ సి ఉండాలి. నారింజ, నిమ్మకాయలు, ద్రాక్షపండ్లలో విటమిన్ సి పుష్కలంగా లభిస్తుంది. క్యారెట్లలో బీటా కెరోటిన్ అధికంగా ఉంటుంది. ఇది చర్మంపై ముడతలు, గీతలు తగ్గించడంతోపాటు చర్మ ఆరోగ్యాన్ని కాపాడటంలో ముందుంటుంది. కేల్ ఆకుకూర.. వేసవిలో అనేక ప్రయోజనాలను అందిస్తుంది.

ఇందులోని విటమిన్ ఎ.. చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. దీన్ని సలాడ్, సూప్‌లో తీసుకోవడం ద్వారా.. ఇందులోని విటమిన్లన్నిటినీ శరీరానికి అందించవచ్చు. ఇక గ్రీన్ టీలో ఉండే శక్తిమంతమైన ఫ్లేవనాయిడ్స్.. చర్మాన్ని ఫ్రీరాడికల్స్ నుంచి రక్షిస్తాయి. చర్మం ఎక్కువగా సాగకుండా నిరోధించడంతోపాటు ముడతలు పడకుండా చూస్తాయి. ఉల్లి వెల్లుల్లి కలిపి తింటే..వంటింట్లో ఉల్లి, వెల్లుల్లి తప్పనిసరిగా ఉంటాయి. దాదాపుగా అన్ని రకాల ఆహారాల్లో వీటిని వాడుతూ ఉంటారు.

ఉల్లి, వెల్లుల్లి కలిపితింటే



ఏం జరుగుతుంది? ఏమైనా సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయా? దీనికి నివుణులు చెబుతున్న సమాధానాలు ఇవిగో%శ్రీ%రెండిట్లో పోషకాలు: ఉల్లి, వెల్లుల్లి కలిపి తినడం ఆరోగ్యానికి మంచిది. రెండిట్లోనూ యాంటి ఫంగల్, యాంటి బ్యాక్టీరియల్, యాంటి వైరల్ గుణాలు ఉంటాయి. కాబట్టి, వీటిని కలిపి తీసుకోవడం వల్ల మన రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. పదేపదే జబ్బు పడకుండా ఉంటాం. మైగ్రెయిన్ నుంచి ఉపశమనం: అధిక రక్తపోటు (హైపర్ టెన్షన్) ఉన్నవాళ్లు ఉల్లి, వెల్లుల్లిని కలిపి తినాలి. ఇలా చేస్తే కొంతకాలానికి ఈ సమస్య నుంచి విముక్తి లభిస్తుందంటున్నారు నిపుణులు. అంతేకాదు, పార్శ్వపు నొప్పి (మైగ్రెయిన్)తో బాధపడుతున్న వారికి కూడా ఈ రెండు మంచి ఔషధాలుగా పనిచేస్తాయి. అయితే, ఇలా కలిపి తినడానికి ముందు డాక్టర్ సలహా తీసుకుని ఆచరించడం మంచిది. కొలెస్ట్రాల్‌కు బై బై: శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగినప్పుడు కూడా ఉల్లి, వెల్లుల్లి కలిపి తినడం మంచిది. ఇవి కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుతాయి. శరీరంలో కొవ్వు పేరుకుపోకుండా చేస్తాయి. ఉల్లి, వెల్లుల్లిలో విటమిన్ బి, సి, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి.

తిప్పతీగ రసంలో పసుపు కలిపి తాగితే ఎన్ని లాభాలు ఉంటాయో తెలుసా..?



ఆయుర్వేదంలో ఎన్నో రకాల మూలికలు, మొక్కలు మనకు అందుబాటులో ఉన్నాయి. కొన్ని రకాల మొక్కలు మన ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాల్లోనే పెరుగుతాయి. కానీ అలాంటి ఔషధ మొక్కల గురించి చాలా మందికి తెలియదు. వాటిల్లో తిప్పతీగ కూడా ఒకటి. తిప్ప తీగ కాండం లావుగా ఉంటుంది. దీన్ని చాలా సులభంగా గుర్తించవచ్చు. ఈ మొక్క తీగ జాతికి చెందినది.

మన ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాల్లోనే పెరుగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో తిప్పతీగ మనకు ఎక్కువగా కనిపిస్తుంది. తిప్ప తీగ ఆకుల నుంచి రసం తీసి తాగవచ్చు. ఈ రసంలో కాస్త పసుపు కలిపి తీసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేదం చెబుతోంది. తిప్పతీగ అనేక వ్యాధులను నయం చేస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

రోగ నిరోధక వ్యవస్థకు..: తిప్పతీగ రసాన్ని ఒక టీస్పూన్ మోతాదులో తీసుకుని దాన్ని ఒక కప్పు నీటిలో కలపాలి. అందులోనే కాస్త పసుపు, మిరియాల పొడి, దాల్చినచెక్క పొడి వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని రోజూ ఉదయం పరగడుపున తాగాలి. ఈ పదార్థాలు కొందరిలో అలర్జీలను కలిగించవచ్చు. కనుక అలర్జీ సమస్య ఉన్నవారు ఈ మిశ్రమాన్ని తాగకూడదు. ఈ విధంగా తయారు చేసిన తిప్పతీగ మిశ్రమాన్ని తాగితే అనేక లాభాలు కలుగుతాయి. ఈ మిశ్రమాన్ని సేవించడం వల్ల అనేక ఔషధ గుణాలు లభిస్తాయి. అనేక రోగాలను తగ్గించుకోవచ్చు. దీంతో రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. రోగ నిరోధక శక్తి పెరిగి శరీరం వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. ఎలాంటి రోగం అయినా సరే తగ్గిపోతుంది.

అనేక వ్యాధులు నయమవుతాయి..!

కీళ్లు, మోకాళ్ల నొప్పులకు..: తిప్పతీగ మిశ్రమంలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి శరీరంలోని వాపులు, నొప్పులను తగ్గిస్తాయి. దీంతో ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. కీళ్ల నొప్పులు, వాపుల సమస్యతో బాధపడుతున్నవారు రోజూ ఈ మిశ్రమాన్ని తాగితే ఫలితం ఉంటుంది. ఎముకలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే మోకాళ్ల నొప్పుల నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. ఈ మిశ్రమాన్ని సేవించడం వల్ల జీర్ణక్రియ మెరుగు పడుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ముఖ్యంగా గ్యాస్, కడుపు ఉబ్బరం, మలబద్దకం వంటి సమస్యలు ఉండవు. అలాగే కడుపులో మంట నుంచి ఉపశమనం లభిస్తుంది. జీర్ణ సమస్యలు ఉన్నవారు ఈ మిశ్రమాన్ని సేవిస్తుంటే ఎంతో ఫలితం ఉంటుంది.

డయాబెటిస్ అదుపులో..: తిప్పతీగలో షుగర్‌ను తగ్గించే గుణాలు ఉంటాయి. అలాగే ఈ మిశ్రమంలో కలిపిన అన్ని పదార్థాలు కూడా షుగర్‌ను గణనీయంగా తగ్గిస్తాయి. కనుక డయాబెటిస్ ఉన్నవారు ఈ మిశ్రమాన్ని రోజూ సేవిస్తుంటే షుగర్‌ను కంట్రోల్ చేయవచ్చు. దీంతో డయాబెటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. తిప్పతీగ, పసుపులో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. కనుక ఈ మిశ్రమాన్ని సేవిస్తుంటే మొటిమలు, వాపులు తగ్గుతాయి. ముఖంపై ముడతలు, మచ్చలు తగ్గిపోతాయి. చర్మం కాంతివంతంగా మారుతుంది. యవ్వనంగా కనిపిస్తుంది. చర్మం మృదువుగా కూడా ఉంటుంది. ఈ మిశ్రమం ఆరోగ్యకరమైనదే అయినప్పటికీ మీరు ఏదైనా వ్యాధికి మందులను వాడుతుంటే ఆయుర్వేద వైద్యులను సంప్రదించి దీన్ని వాడడం ఉత్తమం. లేదంటే సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే అవకాశం ఉంటుంది.

సోప్ నెయిల్స్ చూశారా?!



నో మేకప్ లుక్ ఇప్పుడు ట్రెండింగ్. ఇంతకు మునుపులా లేయర్లు లేయర్లు మేకప్ వేసుకుని హీరోయిన్‌లా కనిపించాలన్న ట్రెండు పోయి, హీరోయిన్లు కూడా మేకప్ లేకుండా కనిపించాలనుకునే రోజులు వచ్చాయి. మనిషి ఎంత నేచురల్‌గా కనిపిస్తే అంత అందం అన్నట్టు భావిస్తున్నారిప్పుడు. గోళ్ల విషయంలోనూ అచ్చం అదే పోకడ వచ్చింది. 'సోప్ నెయిల్స్' ఫ్యాషన్ మనకు ఆ విషయాన్నే చెబుతుంది. చూడగానే లేత గులాబీ రంగులో, తెల్లగా, ఆరోగ్యంగా, అప్పుడే మెనిక్యూర్ చేసిన గోళ్లలా శుభ్రంగా కనిపించడం వీటి ప్రత్యేకత. ఇందుకోసం లేత రంగుల్లో (న్యూడ్ షేడ్స్) ఉండే మ్యాటీ ఫినిష్ గోళ్ల రంగుల్ని ఎంచుకుంటున్నారు. పైన గాజులా కనిపించాలనుకుంటే గ్లాసీ ఫినిష్ కోట్‌కు ఓటు వేస్తున్నారు. కొంతమంది సబ్బు నురగల్ని పోలినట్టు లైట్‌గా కోట్‌ను వేస్తున్నారు. ఫేక్ నెయిల్స్ అదేనండీ ఆర్టిఫీషియల్ గోళ్లు పెట్టుకున్నా వాటిని ఇలాగే సింపుల్‌గా కనిపించేలా ముస్తాబు చేస్తున్నారు. ఫ్యాషన్ లేదా సింపుల్ లుక్ ఏదైనా అప్పుడే స్నానం చేసినట్టు శుభ్రంగా కనిపించే ఈ గోళ్లు చక్కగా సరిపోతాయి. ఆరోగ్యమే అసలైన అందం మరి అంటున్నాయన్న మాట ఈ ట్రెండింగ్ సోప్ నెయిల్స్!

'బరువెక్కుతున్న' భారత్



భారత్ ఊబకాయుల నిలయంగా మారుతున్నదని లాన్సెట్ నివేదిక హెచ్చరించింది. 2050 నాటికి దేశంలో 45 కోట్ల మంది ఊబకాయులు ఉంటారని అంచనా వేసింది. అదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా సగానికి పైగా వయోజనులు ఊబకాయం బారినపడతారని తేల్చింది. 2021లో చైనా తర్వాత భారత్‌లోనే స్థూలకాయులు ఎక్కువగా ఉన్నారని తెలిపింది. పిండి పదార్థాలు, తీపి పదార్థాలను తినడం తగ్గించి, ప్రొటీన్లను ఎక్కువగా తీసుకోకపోతే యువత, పిల్లలు స్థూలకాయం బారిన పడే ప్రమాదం మరింత పెరుగుతుందని హెచ్చరించింది.

పులివెందులలో పవన్ మార్క్



కడప, , ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో పులివెందుల నియోజకవర్గం ప్రజల దాహార్తి తీరనుంది. పులివెందుల, పరిసర ప్రాంతాల ప్రజల తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే మెగా వాటర్ గ్రిడ్ పథకంపై పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి పెట్టారు. జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధారల కింద రూ. 280 కోట్ల కేటాయింపులు చేశారు. దీంతో పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పనులు 96 శాతం వరకూ పూర్తయ్యాయి. నీటి శుద్ధి ప్లాంట్ పనులు తుది దశకు చేరుకున్నాయి. పులివెందుల, సింహాద్రిపురం మండలాల్లో 100 శాతం పనులు పూర్తైనట్లు అధికారులు తెలిపారు.పులివెందుల ప్రజల ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం చూపే దిశగా.. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చర్యలు చేపడుతున్నారు. పులివెందుల నియోజకవర్గం, పరిసర ప్రాంతాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పథకం నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించారు. పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో ఈ ప్రాజెక్టు పనులు 96 శాతం మేరకు పూర్తైనట్లు అధికారులు తెలిపారు. ఏడు మండలాలలోని ఐదున్నర లక్షల మంది ప్రజల తాగునీటి సమస్యలను తీర్చే లక్ష్యంతో పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పథకం ప్రారంభించారు. జల్ జీవన్ మిషన్ కింద రూ. 480 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. అయితే పనులు ఆశించినంత వేగంగా జరగకపోవటంతో.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పవన్ కళ్యాణ్ దీనిపై ఫోకస్ పెట్టారు. జల్ జీవన్ మిషన్ పనుల మీద జరిగిన తొలి సమీక్షలో ఇలాంటి ప్రాజెక్టు పనులను ప్రాధాన్య క్రమంలో ముందుకు తీసుకువెళ్లాలని అధికారులను ఆదేశించారు. పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో సుమారుగా రూ. 280 కోట్లు ఒక్క పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పథకానికే కేటాయించి వేగంగా పనులు చేపట్టారు. 96 శాతం పనులు పూర్తి చేశారు.దీంతో ఈ పథకం ద్వారా పులివెందుల, సింహాద్రిపురం మండలాలకు ఇప్పటికే తాగునీరు అందుతోంది. పులివెందుల పట్టణానికి సంబంధించిన పనులు కూడా పూర్తయ్యాయి. వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులో కీలకమైన ఇంటేక్ వెల్ పునరుద్ధరణ పనులను పూర్తి చేశారు. 65 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి శుద్ధి ప్లాంట్లు కూడా అందుబాటులోకి వచ్చాయి. 1,111 కి.మీ గానూ 1,106 కిలోమీటర్ల మేరకు పైప్ లైన్ల నిర్మాణం పూర్తయ్యింది.ఓవర్‌హెడ్ ట్యాంకులు, గ్రౌండ్ లెవల్ రిజర్వాయర్ల నిర్మాణం తుది దశకు చేరుకుందని అధికారులు వెల్లడించారు. ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చేందుకు రాజకీయాలకు అతీతంగా ముందుకు వెళ్లాలన్న పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు.. పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పనులను ఏపీ గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అధికారులు వేగంగా చేపడుతున్నారు

ఫ్యూచర్‌సిటీ రియల్ ఎస్టేట్ జోరు



హైదరాబాద్, : భారత్ ఫ్యూచర్‌సిటీలో రియల్ ఎస్టేట్ భూం నడుస్తోంది. ముఖ్యంగా భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం కేటాయించిన 121 చదరపు గజాల ప్లాట్లకు డిమాండ్ పెరుగుతోంది. గతంలో సుమారు రూ.5 లక్షలకు అమ్ముడైన ప్లాట్లు ప్రస్తుతం రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు పలుకుతున్నాయి. ఫ్యూచర్‌సిటీ కార్యాలయం ప్రారంభం, పరిసరాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, రియల్ ఎస్టేట్ కార్యకలాపాల పెరుగుదలతో ధరలు పెరిగినట్లు తెలుస్తోంది.తెలంగాణ ప్రభుత్వం భారత్ ఫ్యూచర్ సిటీని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. మీర్‌ఖాన్‌పేట-ముచ్చర్ల గ్రామాల మధ్యలో దాదాపు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణమవుతోంది. దీంతో ఆ ఏరియాలో భూముల ధరలకు రెక్కలు వస్తున్నాయి. ప్రస్తుతం ఫ్యూచర్‌సిటీలో భూ నిర్వాసితుల కోసం ప్రభుత్వం కేటాయించిన లే-అవుట్లు, స్థలాలకు గిరాకీ పెరుగుతోంది. ఫ్యూచర్ సిటీకి భూములిచ్చిన 6 వేల మంది రైతులకు ప్రభుత్వం అభివృద్ధి చేసిన లేఅవుట్లను కేటాయించింది. నిర్వాహిసితులకు ఎకరాకు రూ.8 లక్షల పరిహారంతో పాటు 121 చదరపు గజాల ఓపెన్ ప్లాట్లు ఇచ్చింది.మీర్‌ఖాన్‌పేట్, పంజాగూడ, కుర్మిద్ద, తాటిపర్తి, మేడిపల్లి, నానక్‌నగర్, ముచ్చర్ల గ్రామాల్లో నివసిస్తున్న రైతుల నుంచి భారత్ ఫ్యూచర్‌సిటీ కోసం ప్రభుత్వం రెండు దశల్లో భూములను తీసుకుంది. ఆయా గ్రామాల ప్రజలకు పంజాగూడ రెవెన్యూ పరిధిలో లేఅవుట్లు డెవలప్ చేసింది. దాదాపు 6 వేల మంది రైతులకు ఓపెన్ ప్లాట్లు కేటాయించింది. రైతుల పిల్లలు చదువుకునేందుకు వీలుగా యంగ్ ఇండియా సమీకృత గురుకుల స్కూల్ సైతం ప్రభుత్వం నిర్మిస్తోంది. అయితే అక్కడి లే-అవుట్‌లో ఇళ్లు కట్టుకునేందుకు కొందరు సుముఖంగా లేరు. ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారం, ప్లాట్ అమ్మితే వచ్చే డబ్బుతో హైదరాబాద్ దగ్గర్లో భూములు కొనాలని నిర్ణయించారు. ఒకరిద్దరు రైతులు ఏడాది క్రితం విక్రయించగా.. 121 చదరపు గజాల ప్లాటు రూ.5 లక్షలకు అమ్ముడయ్యింది.తాజాగా రియల్ ఎస్టేట్ పుంజుకుంది. ఫ్యూచర్‌సిటీ కార్యాలయం రెండు నెలల క్రితం ప్రారంభమవగానే.. ప్లాట్ల ధరలు అమాంతం పెరిగాయి. ఫ్యూచర్‌సిటీ పరిసర ప్రాంతాల్లో నిన్న మె?న్నటి వరకు చదరపు గజం రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకూ ధర పలకగా.. నిర్వాసితులకు ఇచ్చిన ప్లాట్ల ధర అనూహ్యంగా పెరిగింది. రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకూ ఒక్కో ప్లాటు అమ్ముడవుతోంది. అంటే దాదాపు 10 వేల నుంచి రూ.23 వేల వరకు గజం పలుకుతోంది. జులైలో ఒక రైతు తన ప్లాటును రూ.28 లక్షలకు విక్రయించారు. ఆ ప్లాట్లను కొంటే భవిష్యత్తులో మౌలిక సదుపాయాలు వేగంగా సమకూరుతాయన్న అంచనాతో కొందరు వాటిని కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో భూములు కొనే ఆర్థిక స్థోమత లేని వారు భవిష్యత్ పెట్టుబడిగా ఫ్యూచర్ సిటీలో స్థలాలు కొనేందుకు రెడీ అవుతున్నారు

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వం

విజయవాడ, : ఆంధ్రప్రదేశ్‌లో దశాబ్ద కాలంగా లక్షలాది కుటుంబాలను కుంగదీస్తున్న అతిపెద్ద ఆర్థిక కుంభకోణం అగ్రిగోల్డ్ . తమ కష్టార్జితాన్ని దాచుకుని మునిగిపోయిన చిన్న తరహా డిపాజిటర్లకు రాబోయే ఆరు నెలల్లో డబ్బులు చెల్లించడమే లక్ష్యంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు చేసి, ప్రత్యేక కోర్టుల ద్వారా వేగవంతం చేయడంతో ఈ సుదీర్ఘ పోరాటానికి ఒక ముగింపు లభిస్తుందనే ఆశలు వ్యక్తమవుతున్నాయి. అగ్రిగోల్డ్ గ్రూప్ ఆఫ్ కంపెనీలు రియల్ ఎస్టేట్ ప్లాట్లు, అధిక వడ్డీల ఆశచూపి ఏపీ, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి సుమారు 32 లక్షల మంది డిపాజిటర్ల నుంచి దాదాపు 6,380 కోట్లకు పైగా డిపాజిట్లు సేకరించాయి. అందులో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే దాదాపు 19.5 లక్షల మంది బాధితులు ఉన్నారు. గత ప్రభుత్వాల హయాంలో రూ.10,000, రూ.20,000 లోపు ఉన్న చిన్న డిపాజిటర్లకు కొన్ని వందల కోట్లు చెల్లించినప్పటికీ, ఇంకా వేలాది మంది మిడియం, పెద్ద డిపాజిటర్లకు వేల కోట్ల రూపాయలు బకాయిపడి ఉన్నారు.అగ్రిగోల్డ్ గ్రూప్ కొనుగోలు చేసిన వేలాది ఎకరాల వ్యవసాయ భూములు, ప్లాట్లు, నివాస నముదాయాలు, గుంటూరు నమీపంలోని హాయ్‌లాండ్ అమ్యూజ్‌మెంట్ పార్క్ వంటి ఆస్తులను సీఐడీ , ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అటాచ్ చేశాయి. ప్రెజెంట్ మార్కెట్ వాల్యూ ప్రకారం చూస్తే, ఈడీ, సీఐడీల వద్ద స్వాధీనంలో ఉన్న అగ్రిగోల్డ్ ఆస్తుల విలువ 6,000 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ఈ ఆస్తులను పారదర్శకంగా విక్రయిస్తే డిపాజిటర్ల బకాయిలు దాదాపుగా చెల్లించడానికి సరిపోతాయని అధికార యంత్రాంగం భావిస్తోంది.గతంలో 2014-19 టీడీపీ అధికారంలో ఉన్న సమయంలోనే అగ్రిగోల్డ్ ఆస్తులను ఈ-వేలం ద్వారా విక్రయించి డిపాజిటర్లకు సొమ్ము చెల్లించేందుకు హైకోర్టు పర్యవేక్షణలో ప్రయత్నాలు జరిగాయి. అయితే, ఆ సమయంలో ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ నేతలు, వారికి అనుకూల వర్గాలు కోర్టుల్లో వివిధ రకాల పిటిషన్లు వేయడం, ఆస్తుల విలువను తక్కువ చేసి చూపుతున్నారంటూ వివాదాలు రేపడం వల్ల వేలం ప్రక్రియ వేగం పుంజుకోలేకపోయింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కూడా దఫాల వారీగా కొంతమందే చెల్లింపులు చేయగలిగింది తప్ప, అటాచ్ చేసిన ప్రధాన ఆస్తులన్నింటినీ వేలం వేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించలేకపోయింది.ఆస్తులను అమ్మి బాధితులకు డబ్బులు పంచడం చూడానికి సులువుగా కనిపించినా.. దీని వెనుక సంక్లిష్టమైన లీగల్ చిక్కులు ఉన్నాయి. పీఎంఎల్ఏ చట్టం కింద ఈడీకి ఉన్న హక్కులు, రాష్ట్ర సీఐడీ పరిధిలోని చట్టం కింద ఉన్న అటాచ్‌మెంట్ల మధ్య సమన్వయం సాధించి ఆస్తులను రిలీజ్ చేయించడం. అగ్రిగోల్డ్ యాజమాన్యం వివిధ బ్యాంకుల వద్ద ఆస్తులను కుదువబెట్టి రుణాలు తీసుకుంది. వాటి కోసం డెట్ రికవరీ ట్రిబ్యునల్ ద్వారా బ్యాంకులు తమకే మొదటి హక్కు ఉందంటూ హైకోర్టును ఆశ్రయించాయి. కంపెనీ ప్రమోటర్లు కుటుంబ సభ్యులు, బెనామీల పేర్లపై పెట్టిన ఆస్తులపై వచ్చిన లీగల్ ఛాలెంజెస్ ను కూడా అధిగమించాల్సి ఉంది. ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక కోర్టుల ఏర్పాటును వేగవంతం చేసి, కేబినెట్ సబ్‌కమిటీ ద్వారా బాధితుల డేటాబేస్‌ను సరి చూస్తోంది. పెద్ద పెద్ద ల్యాండ్ పార్సెల్లను చిన్న ప్లాట్లుగా విభజించి వేలం వేయడం ద్వారా ఎక్కువ రాబడి రాబట్టవచ్చని ప్రతిపాదనలు ఉన్నాయి. ప్రభుత్వం గనుక చట్టపరమైన అడ్డంకులను అధిగమించి, రాబోయే ఆరు నెలల గడువులోగా వేలం ప్రక్రియను పూర్తి చేసి డిపాజిటర్ల చేతికి డబ్బులు అందిస్తే.. అది ఒక చారిత్రాత్మక విజయంగా నిలుస్తుంది. దశాబ్ద కాలంగా నమ్మకం కోల్పోయిన లక్షలాది పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇది కొండంత అండగా మారడమే కాకుండా.. కూటమి ప్రభుత్వానికి రాజకీయంగా మైలేజ్ తెచ్చిపెడుతుంది.



పిఠాపురం రోడ్లకు మహర్దశ!

కాకినాడ, : ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిఠాపురం నియోజకవర్గాన్ని దేశంలోనే ఒక ఆదర్శవంతమైన మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గవ్యాప్తంగా పల్లెల నుంచి పట్టణాల వరకు మౌలిక వసతుల కల్పనకు, ముఖ్యంగా రహదారుల పునర్నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. కేవలం రోడ్ల నిర్మాణం, మరమ్మతుల కోసమే ఏకంగా రూ. 200 కోట్లకు పైగా నిధులను వెచ్చించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సోషల్ రోడ్ల భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖల భాగస్వామ్యంతో మొత్తం 307 కిలోమీటర్ల మేర నూతన రహదారుల నిర్మాణ ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే రూ. 100 కోట్ల అంచనా వ్యయంతో 152 కిలోమీటర్ల మేర 611 రోడ్ల నిర్మాణ పనులు విజయవంతంగా పూర్తయ్యాయి. నిర్దిష్ట లక్ష్యంలో దాదాపు 80 శాతం పనులు పూర్తి కావడంతో పిఠాపురం నియోజకవర్గంలో రవాణా వ్యవస్థ రూపురేఖలు మారిపోయి గ్రామాల్లో కొత్త కళ సంతరించుకుంది.రహదారుల నిర్మాణంలో ప్రజల, రైతులు, మత్స్యకారుల అవసరాలను ప్రాతిపదికగా తీసుకున్నారు. దశాబ్దాలుగా తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్న ఉప్పాడ తీరప్రాంత మత్స్యకారుల కోసం ప్రత్యేకంగా జెట్టీకి వెళ్లే మార్గంలో గ్రావెల్ రోడ్డును నిర్మించి వారి రవాణా కష్టాలను తీర్చారు. అంతేకాకుండా సముద్ర కోత వల్ల ఇళ్లను కోల్పోయిన మాయాపట్నం మత్స్యకారులకు సుబ్బంపేట సమీపంలో కల్పించిన కొత్త మాయాపట్నం పునరావాస కాలనీలో 13 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ రూ. 1.52 కోట్లతో 1.5 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 2.8 కిలోమీటర్ల డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేశారు.కొత్తూరాడపేట పునరావాస కాలనీకి సైతం రూ. 93 లక్షలతో 1.6 కిలోమీటర్ల సిమెంటు రోడ్లు నిర్మించి, ప్రధాన రహదారికి అనుసంధానం చేశారు. తుపాన్ల ధాటికి పూర్తిగా కొట్టుకుపోయిన యు.కొత్తపల్లి మండలంలోని అమరవిల్లి-రామన్నపాలెం బీచ్ రోడ్డును రూ. 88 లక్షలతో పునర్నిర్మించడం ద్వారా వేలాది మంది ప్రజలకు, స్థానిక బషీర్ బీబీ ఆలయ దర్శనానికి వెళ్లే భక్తులకు మార్గం సుగమమైంది.సెజ్ పరిధిలో ఉండి ఏళ్ల తరబడి అభివృద్ధికి దూరమైన ముమ్మిడివారిపాడు గ్రామానికి రూ. 79.70 లక్షలతో శాశ్వత రహదారిని అందుబాటులోకి తెచ్చారు. కొత్తపల్లి గ్రామంలో ప్రజల చిరకాల కోరికైన శ్మశాన వాటిక దారిని రూ. 26.30 లక్షలతో సీసీ రోడ్డుగా మలిచారు. కొండెవరం గ్రామ పరిధిలోని పిఠాపురం-ఉప్పాడ ఆర్ అండ్ బీ రోడ్డును రూ. 1.22 కోట్ల ఉపాధి నిధులతో పవన్ కళ్యాణ్ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించారు. మరోవైపు మండలం వెన్నెపూడి జీఎన్టీ ప్రధాన రహదారిని రూ. 85 లక్షలతో, గొల్లప్రోలు-తాటిపర్తి పుంత రోడ్డును రూ. 1.46 కోట్లతో పునర్నిర్మించి రైతులకు, ప్రయాణికులకు ఊరటనిచ్చారు. చిత్రాడ గ్రామంలోని ఈబీసీ కాలనీ వాసుల కోసం రూ. 3 కోట్లతో సీసీ రోడ్లు, ఆధునిక డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టడంతో పాటు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల భద్రతకై రూ. 50 లక్షలతో ప్రహరీ గోడను నిర్మించారు.వ్యవసాయ రంగ సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ 'పల్లెపండుగ 2.0' ద్వారా పంట పొలాల మధ్య ఉన్న డొంక రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పి.రాయవరం, బి. ప్రత్తిపాడు గ్రామాల్లో కోటి రూపాయలకు పైగా వెచ్చించి 3 కిలోమీటర్ల మేర నిర్మించిన గ్రావెల్ రోడ్లు దాదాపు 200 ఎకరాలకు పైగా వ్యవసాయ భూములకు మెరుగైన రవాణా సదుపాయాన్ని కల్పించాయి.



మావిగన్‌కు సమర్థింపుగా అవిగన్ తెస్తున్నారా



విజయవాడ, : మాజీ మంత్రి, వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నేత పేర్ని నాని ఇటీవల నిర్వహించిన విలేకరుల సమావేశంలో అమరావతి రాజధానిని అవిగన్ అమరావతి - విజయవాడ - గుంటూరు గా సిఆర్‌డిఎ లో తీర్మానం చేశారని, త్వరలోనే కేబినెట్ ముందుకు తీసుకురాబోతున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో మైస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిపాదించిన మావిగన్ కాస్తా ఇప్పుడు అవిగన్ గా మారిందని ఆయన సెటైర్లు వేశారు. అది జగన్ ఎఫెక్ట్ అంటున్నారు. మొదటగా సీఆర్డీఏ మాస్టర్ ప్లాన్‌ను గమనిస్తే.. 2015లో అమరావతిని రాజధానిగా ప్రకటించినప్పటి నుంచీ విజయవాడ, గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి, తెనాలి సహా చుట్టుపక్కల వందలాది గ్రామాలు సీఆర్డీఏ పరిధిలోనే ఉన్నాయి. కోర్ క్యాపిటల్ సిటీగా 217 చదరపు కిలోమీటర్ల అమరావతి ప్రాంతం ఉంటే, దాని సమగ్ర అభివృద్ధికి 8,300 చదరపు కిలోమీటర్లకు పైగా విస్తీర్ణాన్ని సీఆర్డీఏ పరిధిగా ప్రభుత్వం నిర్దేశించింది. ఇప్పుడు ప్రత్యేకంగా అవిగన్ పేరుతో క్రొత్తగా ఏదో తీర్మానం చేస్తున్నారని నాని చెప్పడం కేవలం ఒక కొత్త రాజకీయ అస్త్రాన్ని ప్రయోగించడమే తప్ప, అందులో కొత్తగా చట్టపరమైన మార్పు ఏదీ లేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. అయితే, పేర్ని నాని వ్యాఖ్యల్లో అంతర్లీనంగా ఉన్న రాజకీయ మార్పును గమనించాల్సి ఉంది ఐదేళ్ల పాటు మూడు రాజధానుల మంత్రం జపించి, అమరావతిని కేవలం ఒక రియల్ ఎస్టేట్ భ్రమ అని వర్ణించిన వైఎస్ఆర్‌సీపీ నేతలు.. ఇప్పుడు అమరావతి, విజయవాడ, గుంటూరు ప్రాంతాల అనుసంధానత గురించి మాట్లాడుతున్నారు. జగన్ మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో అమరావతిని పక్కనపెట్టడం వల్ల కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పార్టీ తీవ్రంగా దెబ్బతిన్నది. 2024 ఎన్నికల్లో ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల్లో వైఎస్ఆర్‌సీపీ ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్న తర్వాత, అమరావతి ఉనికిని పూర్తిగా వ్యతిరేకించడం పార్టీ ఉనికికే ప్రమాదమని గుర్తించినట్లే కనిపిస్తోంది. ఈ పరిణామం వైఎస్ఆర్‌సీపీ అమరావతికి జై కొడుతోందా అనే ప్రశ్నకు ప్రత్యక్షంగా అవును అని చెప్పలేకపోయినా, పరోక్షంగా యు-టర్న్ తీసుకుంటోందనే సంకేతాలనైతే ఇస్తోంది.

రాజధాని నిర్మాణాన్ని నేరుగా అంగీకరిస్తే ఇన్నాళ్లూ తమ స్టాండ్ తప్పని ఒప్పుకున్నట్లు అవుతుంది. అందుకే, అమరావతి అభివృద్ధిని, సీఆర్డీఏ విస్తరణను కూటమి ప్రభుత్వం మళ్లీ మాట మారుస్తోంది అని నిందించే క్రమంలో అవిగన్ అనే పదాన్ని తెరపైకి తెచ్చారు. రాజధాని వ్యయాన్ని, నగరాల ఏకీకరణను ప్రశ్నించే పేరుతో అమరావతి చర్చలోకి వైఎస్ఆర్‌సీపీ మళ్లీ ప్రవేశించే యత్నం చేస్తోంది.ప్రభుత్వం వైపు నుంచి చూస్తే.. అమరావతిని కేవలం పాలనా నగరంగానే కాక, విజయవాడ, గుంటూరులను కలుపుతూ విశాలమైన మెగా సిటీ గా మౌలిక వసతులు అభివృద్ధి చేయడం మొదటి నుంచి ఉన్న ప్రతిపాదనే. గ్రీన్ ఫీల్డ్ క్యాపిటల్ అమరావతితో పాటు బ్రౌన్ ఫీల్డ్ నగరాలైన విజయవాడ, గుంటూరులను ఎకనామిక్ కారిడార్లుగా మార్చడం సీఆర్డీఏ మాస్టర్ ప్లాన్ ముఖ్య ఉద్దేశం. దీనిని ప్రభుత్వం కొత్తగా దాచాల్సిన అవసరం గానీ, జగన్ దెబ్బకు భయపడి మార్చాల్సిన అవసరం గానీ లేదనేది అధికార కూటమి నేతల వాదన. పేర్ని నాని చేసిన అవిగన్ వ్యాఖ్యలు వైఎస్ఆర్‌సీపీ మారుతున్న రాజకీయ సమీకరణాలకు అద్దం పడుతున్నాయి. రాజధానిపై గతంలో తీసుకున్న కఠిన వైఖరిని పక్కనబెట్టి, సీఆర్డీఏ పరిధి, వ్యయం, నగరాల విలీనం వంటి అంశాలపై సాంకేతిక ప్రశ్నలు వేయడం ద్వారా అమరావతి ప్రాంత ప్రజల్లో పోయిన విశ్వాసాన్ని పునరుద్ధరించుకోవడానికి ఆ పార్టీ ప్రయత్నిస్తోంది. అయితే, ఈ మాటల విన్యాసాలు వైఎస్ఆర్‌సీపీకి ఎంతవరకు రాజకీయ ప్రయోజనం చేకూరుస్తాయో కాలమే నిర్ణయించాలి.

లోకల్ పోల్స్ కోసం జనసేన ప్లాన్

విజయవాడ, : ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పార్టీ నాయకత్వానికి, ఎమ్మెల్యేలకు అత్యంత స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన జనసేన లెజిస్లేటివ్ పార్టీ సమావేశంలో పాల్గొన్న ఆయన, స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కీలక వ్యాఖ్యలు చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో 21 అసెంబ్లీ స్థానాలకే పరిమితమైన వ్యూహం కేవలం ఆ ఎన్నికలకే వర్తిస్తుందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో మాత్రం అదే ఫార్ములా ఉండబోదని తేల్చిచెప్పారు. ప్రాంతాలవారీ రాజకీయ, సామాజిక సమీకరణాల ఆధారంగా జనసేన వ్యూహం స్వతంత్రంగా, ప్రభావశీలంగా ఉంటుందని స్పష్టం చేశారు.ఐదేళ్ల పాటు పార్టీ కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన జనసైనికులు, వీర మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడేలా రాబోయే స్థానిక ఎన్నికల్లో అడుగులు వేయాలని పవన్ పిలుపునిచ్చారు. 2021 స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అరాచకాలను ఎదిరించి జనసేన కార్యకర్తలు ధైర్యంగా నిలబడ్డ విషయాన్ని, అలాగే 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి చారిత్రాత్మక విజయానికి క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు చేసిన అసమాన కృషిని ఈ సందర్భంగా కొనియాడారు. పార్టీ కోసం నిలబడిన ప్రతి కార్యకర్త రాజకీయ బలోపేతమే లక్ష్యంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేనకు మెరుగైన అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.స్థానిక ఎన్నికల విధివిధానాల రూపకల్పన కోసం 9 నుంచి 11 మంది ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు అధినేత ప్రకటించారు. నియోజకవర్గాల వారీగా క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేసి, జనసేన పోటీ చేయడానికి తగిన స్థానాలు, పట్టున్న ప్రాంతాలను గుర్తించి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఎమ్మెల్యేలను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో జనసేన శ్రేణుల మనోభావాలు, స్థానిక రాజకీయ వాతావరణాన్ని పరిగణనలోకి తీసుకున్న తర్వాతే సీట్ల కేటాయింపు, అభ్యర్థుల ఎంపికపై నిర్ణయాలు ఉంటాయని తెలిపారు.ఇదే సమయంలో కొన్ని ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో కూటమి ధర్మానికి భిన్నంగా జరుగుతున్న పరిణామాలు, జనసేన శ్రేణుల అసంతృప్తిపై సమావేశంలో ఎమ్మెల్యేలు పార్టీ చీఫ్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన పవన్.. కార్యకర్తల మనోభావాలు, అభిప్రాయాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. కూటమి ఐక్యతను కాపాడుకుంటూనే, జనసేన బలం ఉన్న ప్రతిచోటా గౌరవప్రదమైన ప్రాతినిధ్యం దక్కేలా చూస్తామని, రాబోయే స్థానిక ఎన్నికల్లో జనసేన తన సత్తా చాటుతుందని పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపారు.



జనసేన కేడర లో కొత్త జోష్

జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్థానిక సంస్థల ఎన్నికలపై ఫోకస్ పెట్టారు. ఈసారి రాజీ పడకూడదని నిర్ణయించుకున్నట్లు ఆయన మాటలను బట్టి తెలుస్తోంది. కూటమిలో పొత్తుకు భంగం కలగకుండా, తమకు నష్టం జరగకుండా స్థానాలను తీసుకోవాలని పవన్ కల్యాణ్ నిర్ణయించుకున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. ఇదే అభిప్రాయాన్ని త్వరలో చంద్రబాబు నాయుడు ముందు కూడా ఉంచనున్నారు. శాసనసభ ఎన్నికల తరహాలో తమ పార్టీకి తక్కువ స్థానాలు ఇవ్వాలన్న ఆలోచన ఉంటే వాటిని సరిచేసుకోవాలని పవన్ కల్యాణ్ సూచించనున్నారు. ఈ మేరకు జనసేన పార్టీ ఎమ్మెల్యేలకు పవన్ కల్యాణ్ స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. 21 స్థానాల్లో పోటీ చేయడం అనేది అప్పటి పరిస్థితుల వరకే.. స్థానిక సంస్థల ఎన్నికల్లో సార్వత్రిక ఎన్నికల వ్యూహం వర్తించదు.. జనసైనికులు, వీర మహిళల ఆత్మగౌరవం కాపాడుతామని పవన్ కల్యాణ్ అనడం చర్చనీయాంశమైంది.. త్వరలోనే కమిటీలను నియమించి పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని కూడా పవన్ నిర్ణయించారు. జనసేన శాసనసభ పక్ష సమావేశంలో పవన్ కల్యాణ్ ఈ వ్యాఖ్యలు చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై లోతుగా చర్చించామని పవన్ కల్యాణ్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసైనికుల పోరాట స్ఫూర్తిని కొనసాగించేలా, వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా ముందుకు తీసుకువెళ్తామని పవన్ కల్యాణ్ ఎమ్మెల్యేలకు చెప్పారు. నేడు కేరళం కు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెళ్లనున్నారు. నేటి నుంచి 20 రోజులపాటు కేరళంలోని ప్రకృతి వైద్య చికిత్సా కేంద్రంలో ఉండనున్న పవన్ చికిత్స చేయించుకోనున్నారు. తరచూ అనారోగ్యానికి గురవుతున్న పవన్ కల్యాణ్ 20 రోజుల పాటు వైద్య శిబిరంలో పవన్ కల్యాణ్ చికిత్సను చేయించుకోనున్నారు. కేరళం నుంచి వచ్చిన వెంటనే చంద్రబాబుతో సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై చర్చించనున్నారు. జనసేనకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ముప్పయి శాతం స్థానాలను దక్కేలా అవసరమైతే టీడీపీ పై వత్తిడి తేవాలని కూడా నిర్ణయించుకున్నారు.

రెంటికి చెడ్డ రేవడిలా ఆ 10 మంది..!

హైదరాబాద్, : రాజకీయాల్లో గోడ దూకిన పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పరిస్థితి ప్రస్తుతం ముందు నుయ్యి.. వెనుక గొయ్యి లా తయారైంది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి తమ నియోజకవర్గాలను డెవలప్ చేసుకుందామనో, లేక రాజకీయ భవిష్యత్తును సురక్షితం చేసుకుందామనో భావించి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న ఈ పది మంది ఎమ్మెల్యేలలో ఒక్కరంటే ఒక్కరు కూడా ప్రస్తుతం సంతోషంగా లేరనేది పొలిటికల్ వర్గాల్లో సాగుతున్న ప్రచారం. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి వంటి కొందరు నేతలు తమ ఆవేదనను బహిరంగంగానే వెళ్లగక్కుతుండగా, మిగిలిన వారు లోలోపల రగిలిపోతూ ఉక్కపోతకు గురవుతున్నారు.ఈ ఎమ్మెల్యేల ప్రస్తుత సంక్షోభానికి ప్రధాన మూలకారణం.. వీరిని కాంగ్రెస్ పార్టీ సాంకేతికంగా, చట్టబద్ధంగా, అధికారికంగా తమలో విలీనం చేసుకోలేకపోవడమే. వీరు కాంగ్రెస్‌లో చేరలేదని స్పీకర్ తీర్పిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ మా ఎమ్మెల్యేలు అయితే మా పార్టీ సమావేశాల్లో ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నిస్తోంది. కోర్టులు, ఎన్నికల సంఘం లేదా సాంకేతిక విచారణల ముందుకు వచ్చినప్పుడు.. మేము కాంగ్రెస్‌లో చేరలేదు, కేవలం మా నియోజకవర్గాల అభివృద్ధి నిధుల కోసమే ముఖ్యమంత్రిని వినతిపత్రాలతో కలిశాం అని న్యాయంగా వాంగ్మూలాలు ఇచ్చుకోవాల్సిన విచిత్రమైన, ఆత్మవంచన చేసుకునే పరిస్థితి వీరికి ఏర్పడింది.కాంగ్రెస్‌లో అనధికారికంగా చేరడం వల్ల వీరు ఒకవైపు బీఆర్ఎస్ పార్టీలో దశాబ్దాలుగా అనుభవించిన హోదా, హక్కులు, కార్యకర్తలపై ఉన్న పట్టును పూర్తిగా కోల్పోయారు. మరోవైపు, అధికారికంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే అనే ముద్ర పడకపోవడంతో ప్రభుత్వ స్థాయిలో ఎలాంటి ప్రత్యేక ప్రాధాన్యతా లభించడం లేదు. ఇటు బిఆర్ఎస్‌పై హక్కు లేక, అటు కాంగ్రెస్‌లో చట్టబద్ధమైన గుర్తింపు రాక రాజకీయంగా వీరు పూర్తిగా 'రెంటికి చెడ్డ రేవడి'లా మారిపోయారనేది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. అధికార పార్టీలో చేరితే నియోజకవర్గానికి వందల కోట్ల నిధులు వస్తాయని, పనులు శరవేగంగా జరుగుతాయని ఆశించిన ఈ నేతలకు నిరాశే ఎదురవుతోంది. సొంత కాంగ్రెస్ నియోజకవర్గాలకే నిధుల కొరత వేధిస్తున్న తరుణంలో, ఈ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు ప్రాధాన్యత లభించడం లేదు. చివరకు తమ నియోజకవర్గాల చిన్న చిన్న పనుల కోసం మంత్రులను, అధికారులను కలవాలన్నా, లేదా చివరకు నిధుల కోసం ఫోన్ చేసినా అధికారులు, కాంగ్రెస్ పెద్దలు ఫోన్లు ఎత్తడం లేదని సదరు ఎమ్మెల్యేలు తమ అనుచరుల వద్ద తీవ్ర వేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ పది మందిలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వంటి వారు పరిస్థితి తీవ్రతను ముందే గ్రహించి, మెల్లగా కాంగ్రెస్ కార్యక్రమాలకు దూరమై తిరిగి బీఆర్ఎస్ వైపు అడుగులు వేశారు. మున్సిపల్ ఎన్నికల్లో తన నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల్ని గెలిపించారు. కానీ, దానం నాగేందర్, పోచారం శ్రీనివాసరెడ్డి, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, ప్రకాష్ గౌడ్ వంటి మిగిలిన నేతలు ఇటు వెనక్కి వెళ్లలేక, అటు ముందుకూ సాగలేక తీవ్రమైన మానసిక సంఘర్షణను అనుభవిస్తున్నారు. కాంగ్రెస్ కేడర్ కూడా వీరిని తమ సొంత నేతలుగా స్వీకరించకపోవడం, పాత కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌లు వీరికి వ్యతిరేకంగా గ్రూపులు కట్టడం వీరి పరిస్థితిని మరింత దారుణంగా మార్చింది.సొంత పార్టీని వీడి అధికార పక్షంలోకి వెళ్తే అన్నీ బాగుంటాయని అనుకున్న ఈ ఎమ్మెల్యేలకు ప్రస్తుత పరిణామాలు ఒక పెద్ద రాజకీయ పాఠంగా మారాయి. ప్రజామోదం పొందిన పార్టీకి దూరమై, సాంకేతిక చట్టాల చిక్కుల్లో పడి, అధికారంలో ఉన్న పార్టీ నుంచి సరైన గుర్తింపు పొందని ఈ పది మంది ఫిరాయింపు ఎమ్మెల్యేల భవిష్యత్తు ప్రస్తుతం తీవ్ర అనిశ్చితిలో పడిపోయింది.

డార్క్ ప్యాటర్న్స్‌పై సీసీపీఏ కొరడా...!



ఆన్‌లైన్ షాపింగ్‌లో వినియోగదారులను తప్పుదోవ పట్టించే 'డార్క్ ప్యాటర్న్స్'పై కేంద్ర వినియోగదారుల పరిరక్షణ అథారిటీ (సీసీపీఏ) కఠిన చర్యలు ప్రారంభించింది. ఇండిగో, జెప్టో, ఫస్ట్‌క్రై, ఫిజిక్స్ వాలా, బుక్‌మైషో, స్పైస్‌జెట్, ఫార్మాఈజీ, మెకాఫీ, అనుజ్ జిందాల్ అకాడమీ సహా తొమ్మిది డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై మొత్తం సుమారు రూ.20 లక్షల జరిమానాలు విధించింది. వినియోగదారుల స్పష్టమైన అనుమతి లేకుండా కార్ట్‌లో మెంబర్‌షిప్‌లు లేదా విరాళాలు చేర్చడం, ఆఖరి స్టేజ్‌లో అదనపు ఛార్జీలు చూపించడం, భావోద్వేగపూరిత సందేశాలతో కొనుగోలుదారులను ఒప్పించడం, కౌంట్‌డౌన్ టైమర్లతో తప్పుడు అత్యవసర పరిస్థితి సృష్టించడం వంటి పద్ధతులను సీసీపీఏ 'డార్క్ ప్యాటర్న్స్'గా గుర్తించింది. 2023లో తీసుకొచ్చిన మార్గదర్శకాలను ఉల్లంఘించిన సంస్థలపై చర్యలు కొనసాగుతున్నాయని కేంద్ర ప్రభుత్వం రాజ్యసభలో వెల్లడించింది. ఈ-కామర్స్ సంస్థలు తమ ప్లాట్‌ఫామ్‌లను స్వయంగా ఆడిట్ చేసి ఇలాంటి పద్ధతులను తొలగించాలని కూడా సీసీపీఏ ఆదేశించింది. ఈ చర్యల్లో జెప్టోకు రూ.7 లక్షలు, ఫిజిక్స్ వాలాకు రూ.5 లక్షలు, అనుజ్ జిందాల్‌కు రూ.3 లక్షలు, ఫస్ట్‌క్రైకు రూ.2 లక్షలు, ఫార్మాఈజీ, మెకాఫీ, స్పైస్‌జెట్‌లకు చెరో రూ.1 లక్ష జరిమానా విధించారు. ఇండిగో తన యాప్‌లో 'లేదు... నేను రిస్క్ తీసుకుంటాను' వంటి వినియోగదారుడిపై ఒత్తిడి తెచ్చే సందేశాన్ని తొలగించి, సరైన ఆప్షన్ కనిపించేలా మార్చింది. బుక్‌మైషో కూడా ముందే సెలక్ట్ చేసిన డొనేట్ ఆప్షన్‌ను తొలగించింది. డేటమ్ ఇంటెలిజెన్స్ నివేదిక ప్రకారం, డార్క్ ప్యాటర్న్స్ కారణంగా దేశీయ ఆన్‌లైన్ యూజర్లు ఏటా రూ.25,000?28,000 కోట్ల వరకు అదనపు ఖర్చు భరిస్తున్నారు. దేశంలోని 30.4 కోట్ల ఆన్‌లైన్ కొనుగోలుదారుల్లో 88 శాతం మంది ఈ పద్ధతుల ప్రభావానికి గురవుతున్నారని, కనిపించని ఛార్జీలు, డ్రిప్ ప్రైసింగ్, బలవంతపు సబ్‌స్క్రిప్షన్లు డిజిటల్ మార్కెట్‌పై వినియోగదారుల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయని నివేదిక హెచ్చరించింది.

సెలబ్రెటీలకు ఫుడ్ సేఫ్టీ వార్నింగ్

న్యూఢిల్లీ, : కొన్ని సంస్థలు, కంపెనీలు ప్రచారం చేసుకునేందుకు సోషల్ మీడియాను ఎందచుకుంటున్నాయి. ఇందులోని ఇన్ ఫ్లుయెన్సర్స్ సైతం ఆదాయం పెంచుకునేందుకు కొన్ని ప్రత్యేక ప్రొడక్ట్స్ ను విపరీతంగా ప్రచారం చేస్తున్నాయి. చాలా మంది ఇలా వాటి గురించి తెలుసుకొని వస్తువులు, ఆహార పదార్థాలు కొనుగోలు చేస్తున్నారు. ఇలా ప్రచారం చేసేవారిని 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా హెచ్చరించింది. ఉత్పత్తుల గురించి పూర్తిగా తెలుసుకోకుండా ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపింది. దీని గురించి పూర్తి వివరాల్లోకి వెళితె..కొందరు సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్లు ఆహార పదార్థాలు, వాటి ఆరోగ్య ప్రయోజనాల గురించి పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. అయితే ఉత్పత్తుల గురించి ధ్రువీకరించని ఆరోగ్య ప్రయోజనాలను ప్రచారం చేయొద్దని స్పష్టం చేసింది. ముఖ్యంగా ఆహారపదార్థాల్లోని 'ఇమ్యూనిటీ' 'పోషకాలు అధికంగా ఉన్నాయి' వంటి వాటి గురించి నిజానిజాలను పరిశీలించాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ హెచ్చరించింది.ఒక ఉత్పత్తిని ప్రమోట్ చేస్తున్నప్పుడు దాని ప్యాకేజింగ్‌పై ఉన్న వివరాలు, పోషక విలువలు, తయారీదారు చేస్తున్న ఆరోగ్య క్లెయిమ్స్ వంటి అంశాలను ఇన్‌ఫ్లుయెన్సర్లు పరిశీలించాలి. కేవలం బ్రాండ్ చెప్పిందని లేదా డబ్బులు తీసుకుని నిర్ధారణ లేని ఆరోగ్య ప్రయోజనాలను ప్రజలకు చెప్పకూడదు. ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనల ప్రకారం ఫుడ్‌కు సంబంధించిన క్లెయిమ్స్ నిజమైనవి, స్పష్టమైనవి, అర్థవంతమైనవి, వినియోగదారులను తప్పుదోవ పట్టించనివిగా ఉండాలి.ఒక ఆహార పదార్థం లేదా దానిలోని ఏదైనా పదార్థం ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపుతుందని చెప్పే హెల్త్ క్లెయిమ్స్‌కు తగిన శాస్త్రీయ ఆధారాలు ఉండాలి. గతంలో కూడా ఫుడ్ ప్రొడక్టులపై తప్పుడు లేదా అతిశయోక్తి ఆరోగ్య క్లెయిమ్స్ అనుమతించబోమని స్పష్టం చేసింది. ఒక ఉత్పత్తిలో ప్రొటీన్, విటమిన్లు లేదా మరేదైనా పోషక పదార్థం ఉన్నంత మాత్రాన దాన్ని మొత్తం ఆరోగ్యకరమైన ఆహారంగా చిత్రీకరించడం సరైనది కాదు. ఇదొక్కటే 'ఆరోగ్యకరమైనది'గా చూపకుండా, సమతుల్య ఆహారం, పండ్లు, కూరగాయలు, శారీరక శ్రమ వంటి అంశాలతో కలిపి ఆహారాన్ని చూడాల్సి ఉంటుంది.సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు లక్షలాది మంది ఫాలోవర్లు ఉంటారు. వారు ఒక ఫుడ్‌ను ఇమ్యూనిటీ పెంచుతుంది.. ప్రొటీన్ లోపాన్ని తీరుస్తుంది లేదా ఆరోగ్యానికి ఎంతో మంచిది అని చెబితే, చాలామంది వినియోగదారులు దాన్ని నిపుణుల సలహాగా భావించే అవకాశం ఉంటుంది. అందుకే ఫాలోవర్లను ప్రభావితం చేసే వ్యక్తులు ఉత్పత్తి గురించి చెప్పే ప్రతి ఆరోగ్య క్లెయిమ్ విషయంలో మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

యోగి బాటలో సువేందు



కోల్ కత్తా, : పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో దశాబ్దాలుగా నెలకొన్న ధోరణులను సవాలు చేస్తూ సువేందు అధికారి తన పాలనను ఆరంభించారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మలు అనుసరించిన కఠినమైన, చట్టబద్ధమైన విధానాన్ని ఆయన అనుసరిస్తున్నారని విశ్లేషకులు గమనిస్తున్నారు. అధికారంలోకి వచ్చి మూడు నెలల్లోనే పాత సమస్యలపై దృష్టి సారించడం ఈ విధానం ప్రధాన లక్షణం.యోగి ఆదిత్యనాథ్ ఉత్తరప్రదేశ్‌లో మాఫియా నెట్‌వర్క్‌లను అణచివేయడం, మహిళలపై దాడులు చేసేవారిపై కఠిన చర్యలు, అక్రమ నిర్మాణాలపై బుల్డోజర్ చర్యలు, అల్లర్ల సమయంలో రాష్ట్రాన్ని శాంతియుతంగా ఉంచడం వంటి అంశాలు గుర్తుంచుకోదగినవి. సువేందు అధికారి కూడా ఇలాంటి సమస్యలపై దృష్టి సారించారు. ఏడు దశాబ్దాలుగా పరిష్కారం కాని అంశాలను త్వరగా అందుకోవడం ఆయన పాలనలో కనిపిస్తోంది. కోల్‌కతా విమానాశ్రయం సమీపంలోని నిర్మాణం విమానాల కదలికకు అడ్డంకిగా మారిన సందర్భంలో కఠిన నిర్ణయం తీసుకోవడం ఇందుకు ఉదాహరణ. ఇలాంటి చర్యలు రాష్ట్రంలో చట్ట పాలనను బలోపేతం చేస్తాయని మద్దతుదారులు వాదిస్తున్నారు.ప్రజా ప్రదేశాల్లో మసీదులు, ఆలయాలు, చర్చిల నుంచి వచ్చే అధిక శబ్దం సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉందని గుర్తించి చర్యలు తీసుకుంటున్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఇలాంటి సమస్యపై యోగి ప్రభుత్వం తీసుకున్న చర్యలను అనుసరిస్తూ, అవసరమైన చోట్ల మైకుల తొలగింపు జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో మదరసాలు, మసీదుల వద్ద ఏర్పడే గందరగోళాన్ని తగ్గించే ప్రయత్నం కూడా కొనసాగుతోంది. మంత్రి అగ్నిమిత్ర పాల్ త్వరలో ఫలితాలు కనిపిస్తాయని సూచించారు. ఇది మతాల మధ్య సమాన నియమాలను అమలు చేసే ప్రయత్నంగా చూడవచ్చు.ఈ చర్యలపై ముస్లిం అనుకూల పార్టీలు, కొన్ని మసీదు అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. సెక్యూలర్ ఫ్రంట్ ఎమ్మెల్యే నౌసాద్ సిద్దీఖి కుటుంబం నిర్వహించే దర్గా సంబంధిత వ్యక్తులు, కోల్‌కతాలోని నకుడా మసీదు ప్రతినిధులు మైకుల తొలగింపును వ్యతిరేకించారు. సీఎంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వం తన విధానంపై స్థిరంగా ఉండటం గమనార్హం. ఇలాంటి వ్యతిరేకత రాజకీయ ధ్రువీకరణకు దారితీసే అవకాశం ఉంది. అయితే చట్టం ముందు అందరూ సమానమనే సూత్రాన్ని నొక్కి చెప్పడం ఈ విధానం యొక్క ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.సువేందు అధికారి పాలన ఇప్పటికే యోగి, హిమంత మాదిరిగా చట్టం, శాంతి, అభివృద్ధి నినాదంపై దృష్టి సారించింది. కొన్ని నెలల్లోనే పాత సమస్యలపై చర్యలు తీసుకోవడం ప్రజల్లో ఆశను కలిగించవచ్చు. అయితే దీర్ఘకాలిక విజయం చట్ట అమలు సమానత్వం, పక్షపాత రహిత విధానం, సామాజిక సామరస్యం కాపాడటంపై ఆధారపడి ఉంటుంది. వ్యతిరేక పార్టీలు, మత సంస్థల నుంచి వచ్చే ఒత్తిడిని సమర్థవంతంగా నిర్వహించగలిగితే బెంగాల్ రాజకీయాల్లో కొత్త ధోరణి నెలకొనే అవకాశం ఉంది.

తెలంగాణకు జనసేన ముఖ్యమంత్రి



హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో జనసేన పాత్రపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం తెలంగాణలో ఉన్న పార్టీలకు ప్రత్యామ్నాయంగా జనసేన ఎదిగే అవకాశాలు ఉన్నాయని, వచ్చే మున్సిపల్, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు సూచించారు. తెలంగాణ రాజకీయాల్లో జనసేన భవిష్యత్తుపై రాజాసింగ్ ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 2014 నుంచి తెలంగాణ రాజకీయాల్లో శూన్యత నెలకొందని, జనసేన ఆ శూన్యతను భర్తీ చేసే అవకాశాలు ఉన్నాయని రాజాసింగ్ వ్యాఖ్యానించారు తెలంగాణలో బీజేపీ, జనసేన పొత్తు ఉండదంటూ బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు రామచంద్రరావు ఇటీవల ప్రకటన చేసిన నేపథ్యంలో తాజాగా రాజాసింగ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. తెలంగాణలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు ఆదరణ ఉందని, జనసేన పార్టీకి మద్దతు పెరుగుతోందని రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా అత్యంత కీలక పరిణామానికి దారితీసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. రాజాసింగ్ ఏ ఉద్దేశంతో ఈ వ్యాఖ్యలు చేశారనేది స్పష్టంగా తెలియకపోయినా, తెలంగాణ రాజకీయాల్లో జనసేనను ఓ వర్గం కోరుకుంటుంది అనే సంకేతాలు అందుతున్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు తెలంగాణలో జనసేన బలమైన రాజకీయ శక్తిగా ఎదగాలని తాను కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి. హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలతోపాటు అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులను పోటీకి పెట్టేలా జనసేనాని ఇప్పటి నుంచే ప్రణాళికలు రచించాలని రాజాసింగ్ కోరారు. ఇదే సమయంలో ఆయన తెలంగాణ రాజకీయాల్లో క్రియాశీలంగా ఉన్న అధికార కాంగ్రెస్, ప్రతిపక్షంలోని బీఆర్ఎస్, బీజేపీపైనా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రధానంగా పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసిందని రాజాసింగ్ ఆరోపించారు. అదే సమయంలో బీజేపీలో పరిస్థితులు ఏమంత బాగా లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వల్ల పెద్దగా ఒరిగిందేమీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇలాంటి పరిస్థితుల్లో జనసేన గట్టిగా పనిచేస్తే తెలంగాణలో అధికారంలోకి వచ్చే అవకాశం ఉందని సంచలన విశ్లేషణ చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను చూసిన జనాలు విసిగిపోయారని, బీజేపీ అంతర్గత రాజకీయాలు వల్ల అధికారంలోకి వచ్చే అవకాశం లేదని రాజాసింగ్ విశ్లేషించారు. ప్రస్తుతం ఈ అంశంపైనే ఎక్కువ చర్చ జరుగుతోందని, తన అంచనాల ప్రకారం వచ్చే ఎన్నికల్లో జనసేన ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు కూడా ఉన్నాయని రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా విస్తృత చర్చకు దారితీస్తున్నాయి. గత ఎన్నికల్లో బీజేపీ టికెట్ పై పోటీ చేసిన రాజాసింగ్ గత ఏడాది ఆ పార్టీకి రాజీనామా చేశారు. హిందుత్వవాదిగా ముద్రపడిన ఆయన తాజాగా చేసిన వ్యాఖ్యలతో జనసేనాని పవన్ కు దగ్గరయ్యే సంకేతాలిస్తున్నారని పరిశీలకులు అనుమానిస్తున్నారు.

ఇకపై ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ల ద్వారా వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు

హైదరాబాద్ : తెలంగాణలో వాహనాల ఫిట్‌నెస్ తనిఖీలను మాన్యువల్ విధానం నుంచి ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లకు మార్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. తొలి దశలో 15 ఏటీఎస్‌లను ఏర్పాటు చేయనున్నారు. ట్రక్కులు, బస్సులు, కార్లు, జీపులు తదితర వాహనాలను సెన్సర్ల ద్వారా పరీక్షిస్తారు. బ్రేకింగ్ సామర్థ్యం, ఇంజిన్ పనితీరు, కాలుష్య ఉద్గారాలు, ఇతర సాంకేతిక ప్రమాణాలను మెషీన్లు ఆటోమెటిక్‌గా అంచనా వేస్తాయి. ఫలితాలను కేంద్ర వాహన్ పోర్టల్‌లో నేరుగా నమోదు చేస్తారు. కాగా, ఈ ఏటీఎస్ కేంద్రాలను 37 ప్రాంతాలకు విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణలో వాహనాల రోడ్డు ఫిట్‌నెస్ పరీక్షల విధానంలో కీలక మార్పు రానుంది. ఇప్పటివరకు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో మాన్యువల్‌గా నిర్వహిస్తున్న ఫిట్‌నెస్ టెస్టుల స్థానంలో ఇకపై ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లు (ఏటీఎస్) అందుబాటులోకి రానున్నాయి. వాహనం రోడ్డుపై నడవడానికి సురక్షితంగా ఉందా లేదా అన్నది ప్రత్యేక సెన్సర్లు, యంత్రాల ద్వారా శాస్త్రీయంగా పరీక్షించి ధ్రువీకరణ పత్రం జారీ చేయనున్నారు. రవాణా శాఖ తొలిదశలో రాష్ట్రవ్యాప్తంగా 15 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వీటి ఏర్పాటుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ దాదాపు పూర్తయినట్లు రవాణా శాఖ వర్గాలు వెల్లడించాయి. తొలి దశలో ఏర్పాటు చేసే కేంద్రాలను డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ కార్యాలయాల పరిధిలో రెండు క్లస్టర్లుగా ఏర్పాటు చేయనున్నారు. అనంతరం ఈ నెట్‌వర్క్‌ను మొత్తం 37 ప్రతిపాదిత ప్రాంతాలకు విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది.ఏటీఎస్‌లో వాహనాన్ని ప్రత్యేక సెన్సర్లతో కూడిన పరికరాలపై నడిపిస్తారు. ఈ ప్రక్రియలో బ్రేకులు ఎంత సమర్థంగా పనిచేస్తున్నాయి, ఇంజిన్ పనితీరు ఎలా ఉంది, వాహనం నుంచి వెలువడుతున్న కాలుష్య ఉద్గారాలు నిర్ణీత ప్రమాణాల్లో ఉన్నాయా వంటి అంశాలను ఆటోమేటిక్‌గా పరీక్షిస్తారు. అదేవిధంగా ప్రభుత్వం నిర్దేశించిన ఇతర సాంకేతిక ప్రమాణాలను కూడా యంత్రాల ద్వారా పరిశీలిస్తారు. భారీ, మధ్యతరహా వాహనాలతో పాటు లైట్ మోటార్ వెహికల్స్ కూడా ఏటీఎస్ పరిధిలోకి రానున్నాయి. ట్రక్కులు, బస్సులు వంటి హెవీ, మీడియం వాహనాలతో పాటు కార్లు, జీపులు తదితర తేలికపాటి వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించనున్నారు. దీంతో వాహన రకం ఆధారంగా అవసరమైన సాంకేతిక ప్రమాణాలను సమగ్రంగా పరిశీలించే అవకాశం ఉంటుంది.ప్రస్తుతం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో వాహనాల ఫిట్‌నెస్ తనిఖీలు మాన్యువల్‌గా జరుగుతున్నాయి. ఈ విధానంలో కొన్నిసార్లు వాహనాన్ని పూర్తిస్థాయిలో సాంకేతికంగా పరిశీలించకుండానే పైపైనే చూసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వాహనం నిజంగా రోడ్డు ప్రయాణానికి సురక్షితమైనదేనా అన్న అంశంపై మరింత కచ్చితమైన అంచనా అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యం లో ఫిట్‌నెస్ పరీక్షలను ఆటోమేటిక్ చేయం ద్వారా పారదర్శకతను పెంచాలని రవాణా శాఖ భావిస్తోంది. ఏటీఎస్‌లో నిర్వహించిన పరీక్షల ఫలితాలు నేరుగా కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖకు చెందిన వాహన్ పోర్టల్‌లో అప్‌లోడ్ అవుతాయి. దీంతో పరీక్షల రికార్డులు డిజిటల్‌గా నమోదవుతాయి. వాహనం ఫిట్‌నెస్‌కు సంబంధించిన సమాచారాన్ని భవిష్యత్‌లో సులభంగా పరిశీలించే అవకాశం ఉంటుంది.

మారనున్న కేబీఆర్ పార్కు రూపు రేఖలు

హైదరాబాద్ : హైదరాబాద్ ప్రజలకు మరో సూపర్ న్యూస్. నగరంలో ప్రముఖ పార్కుగా ప్రసిద్ధి పొందిన కేబీఆర్ పార్క్ వద్ద రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి. ఈ పార్క్ వద్ద విపరీతమైన ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. దీనిని తగ్గించేందుకు ప్రభుత్వం సరికొత్త ఆలోచన చేసింది. పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణానికి ముందడుగు వేసింది. మొత్తం 14 నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ఏడు ప్రధాన కూడళ్ల వద్ద ఈ నిర్మాణాలు జరగనున్నాయి. మొన్నటివరకు కోర్టు కేసులు, భూసేకరణ ప్రక్రియ వల్ల కొంత జాప్యం జరగగా.. ఇప్పుడు అవన్నీ తొలగిపోయాయి. దీంతో అధికారులు ప్రక్రియను మరింత వేగవంతం చేశారు. రెండేళ్లల్లో పనులన్నీ పూర్తి చేయాలనే లక్ష్యం నిర్దేశించుకున్నారు. వాహనదారులకు ఇబ్బంది కలగకుండా పనులు త్వరతగతిన పూర్తి చేయాలని భావిస్తున్నారు.ఈ ప్రాజెక్టులో భాగంగా జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36 నుంచి కేబీఆర్ పార్క్ రోడ్డు మధ్య నాలుగు లైన్ల ఫ్లైఓవర్ ఉంటుంది. ఇక పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వైపుకు 3 లైన్ల ఫ్లైఓవర్ నిర్మిస్తారు. ఇక మహారాజా అగ్రసేన జంక్షన్ నుంచి బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 10 వైపు 2 లైన్ల ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. ఇక ఫిల్మ్ నగర్-బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 మధ్య 2 లైన్లతో కూడిన ఫ్లైఓవర్ ప్రతిపాదించారు. అలాగే జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్-జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45 మధ్య 2 లైన్ల ఫ్లైఓవర్ ఉంటుంది. ఇక వీటితో పాటు మొత్తం 6 అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. ఫిల్మ్ నగర్ జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వైపు 2 లైన్ల అండర్ పాస్, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి నుంచి ఫిల్మ్ నగర్ వైపు ఒక అండర్ పాస్, ఎల్వీ ప్రసాద్ నుంచి పంజాగుట్ట వైపు 3 లైన్ల అండర్ పాస్, రోడ్డు నెంబర్ 45 నుంచి కేబీఆర్ పార్క్ ఎంట్రన్స్ వరకు ఒక అండర్ పాస్ ఉంటుంది.దాదాపు ఈ ప్రాజెక్టులు పూర్తి చేయడానికి రూ.1090 కోట్లు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారు. వీటిల్లో నిర్మాణ పనుల కోసం రూ.699.75 కోట్లు ఖర్చు కానుండగా.. భూసేకరణ ప్రక్రియ కోసం రూ.390 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేస్తున్నారు.

రూ.4000 కోట్ల బడ్జెట్‌తో రామాయణ



బాలీవుడ్ నుంచి మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌లలో ఒకటి రామాయణ దాదాపు రూ.4000 కోట్ల బడ్జెట్‌తో రాబోతున్న ఈ చిత్రం 45కి పైగా భాషల్లో విడుదల కాబోతుంది. ఇక ఈ సినిమాలో రాముడిగా రణ్‌బీర్ కపూర్ నటించబోతుండగా.. సాయిపల్లవి సీత పాత్రలో నటిస్తుంది. రావణుడిగా కన్నడ స్టార్ హీరో యష్. హనుమంతుడిగా సన్నీ డియోల్, లక్ష్మణుడిగా రవి దూబే తదితరులు నటించబోతు న్నారు. అయితే ఈ సినిమాలో తన పాత్రకు సంబంధించి తాజాగా ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు నటుడు సన్నీడియోల్. ఈ చిత్రంలో హనుమంతుడి పాత్ర పోషిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఈ రోల్ చాలా సరదాగా అల్లరిగా ఉండడంతో పాటు-ఉత్సహంగా ఉంటుందని సన్నీ తెలిపాడు. నా పాత్రకు సంబంధించి త్వరలోనే షూటింగ్ ప్రారంభంకానుంది. ఇలాంటి పాత్రలు చాలా సవాలుతో కూడుకున్నవని అందులో పూర్తిగా లీనమై నటించాలని సన్నీ అభిప్రాయపడ్డారు. ప్రేక్షకులకు ఒక గొప్ప సినిమాటిక్ అనుభూతిని పంచడానికి చిత్రబృందం నిరంతరం శ్రమిస్తోందని ఆయన తెలిపారు. హాలీవుడ్ సినిమాల స్థాయికి ఏమాత్రం తగ్గకుండా ఈ సినిమాను రూపొందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. రామాయణం లాంటి మహాకావ్యాన్ని ఎన్నిసార్లు తెరకెక్కించినా కొత్త గానే ఉంటుందని, ఈ సినిమాతో ప్రపంచమంతా రామాయణం గొప్పతనాన్ని మరోసారి తెలుసుకుంటుందని సన్నీ డియోల్ ధీమా వ్యక్తం చేశారు

ఎన్టీఆర్‌తో కార్తికేయ సినిమా





మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఎప్పటినుండో ఓ కథ రెడీ చేస్తున్నారు. అదే లార్డ్ కార్తికేయ సుబ్రహ్మణ్య స్వామి కథ. ఈ సినిమాకు గాడ్ ఆఫ్ వార్ అనే టైటిల్ కూడా ఫిక్స్ చేసినట్టు వార్తలు ఎప్పటినుండో వినిపిస్తున్నాయి. అయితే ఈసినిమాను ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తో చేస్తున్నట్టు లాంగ్ బ్యాక్ ఒక అనౌన్స్ మెంట్ కూడా ఇచ్చారు. హ్యాట్రిక్స్ హిట్స్ తర్వాత అల్లు అర్జున్– త్రివిక్రమ్ కాంబోలో ఒక భారీ మైథలాజికల్ చిత్రానికి శ్రీకారం చుట్టారు. కాని పుష్ప హిట్ తర్వాత త్రివిక్రమ్ సినిమా నుండి బన్నీ స్టెప్ అవుట్ అయ్యాడు. ఆ ప్లేస్ లోకి జూనియర్ ఎన్టీఆర్ వచ్చి చేరాడు. భారీ విజువల్స్, గ్రాండ్ సెట్స్, గ్లోబల్ స్టాండర్డ్స్‌తో రూ. 1000 కోట్ల బడ్జెట్ తో ఈ సినిమా ఉంటుందని ఇండస్టీ సర్కిల్స్ లో వినిపించింది. త్రివిక్రమ్ మార్క్ షార్ప్ డైలాగ్స్, మైథలాజికల్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమాను ప్రపంచ స్థాయి ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందించనున్నారని టాక్ నడిచింది. అయితే ఇటీవల ఈ కథ మళ్లీ అల్లు అర్జున్ కాంపౌండ్ లోకి వచ్చిందని బాలీవుడ్ నుండి ఫీలర్లు వదిలారు. దాంతో ఈ సినిమాపై గందరగోళం నెలకొంది. తాజాగా సితార నాగవంశీ అనగనగ ఒక రాజు ట్రైలర్ ఈవెంట్ లో మాట్లాడుతూ' కాలర్ లు ఎగరేయడం ఇప్పుడు ఎం దుకులే. మే నెల నుండి కాలర్ ఎగరేద్దాం అని చెప్పాడు. దాంతో ఈ మూవీ జూనియర్ ఎన్టీఆర్ తోనే ఉంటుందని చెప్పకనే చెప్పేసాడు నాగవంశి. అన్ని అనుకున్నట్టు జరిగితే 2027 ఫిబ్రవరి లేదా మార్చిలో ఎన్టీఆర్ – త్రివిక్రమ్ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది.

మహేష్-రాజమౌళి సినిమాలో సరికొత్త టెక్నాలజీ..?



దిగ్గజ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబోలో ఒక సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. SSMB%29 అనే వర్కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌ను దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కె.ఎల్. నారాయణ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. మహేశ్ – రాజమౌళి కాంబోలో ఫస్ట్ మూవీ కావడంతో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ని ఈ ఏడాది నవంబర్‌లో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. గ్లోబ్ ట్రాటర్‌ని పరిచయం చేయబోతున్నట్లు తెలిపింది. అయితే ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి ఒక సాలిడ్ వార్త ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఈ సినిమాలో రాజమౌళి బ్లూ–స్క్రీన్ టెక్నాలజీని ఉపయోగించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. మొదట ఈ సినిమా షూటింగ్‌ను కెన్యాలోని నేషనల్ పార్క్‌లలో చేయాలని చిత్రబృందం ప్లాన్ చేసుకున్న విషయం తెలిసిందే. ఇందుకోసం రాజమౌళి కూడా అక్కడి లోకేషన్‌లను జల్లెడ పట్టి వచ్చాడు. అయితే ప్రస్తుతం కెన్యాలో నెలకొన్న రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఈ ప్లాన్ మారినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం, రాజమౌళి కెన్యాకు బదులుగా టాంజానియాలోని సెరెంగెటి అడవుల్లో షూటింగ్ చేయాలని నిర్ణయించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు ఈ చిత్రంలో బ్లూ–స్క్రీన్ టెక్నాలజీని ఉపయోగించి ఆఫ్రికా అడవులను గ్రాఫిక్స్ ద్వారా రూపొందించబోతున్నట్లు సమాచారం. అయితే ఈ రెండు విషయాలపై చిత్రబృందం క్లారిటీ ఇవ్వాల్సి ఉంది.

శరీరాకృతి ఎప్పుడూ ఒకేలా ఉండదు..



మహిళలశరీరాకృతి ఎప్పుడూ ఒకేలాఉండదని,ఐదేళ్లకు ఓసారి మార్పులు జరుగుతుంటాయని ప్రముఖ నటి తమన్నా భాటియా పేర్కొన్నారు. ఎల్లప్పుడూ ఒకే శరీరాకృతితో కనిపించలేమని ఆమె వివరించారు. బరువు తగ్గేందుకు ఇంజెక్షన్లు వాడుతున్నారంటూ తనపై జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తూ తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. పదిహేనేళ్ల వయసు నుంచే తాను నటిస్తున్నానని తెలిపారు. అప్పుడు ఎలా ఉన్నానో ఇప్పటికీ అలాగే ఉన్నానని తాను భావిస్తున్నట్లు చెప్పారు. అయితే, సినిమాల్లోని పాత్రల కోసం ఒక్కోసారి బరువు పెరగడం, మరోసారి తగ్గడం చేయాల్సి వస్తుందని తమన్నా వివరించారు. చిన్న వయసులోనే సినిమాల్లోకి వచ్చానని, కెమెరాతో తన ప్రయాణం సాగుతోందని చెప్పారు. ఇందులో దాచిపెట్టడానికి ఏమీలేదన్నారు. చిరంజీవి సినిమాలో ఐటెం సాంగ్..!: ఇటీవల కాలంలో తమన్నా స్పెషల్ సాంగ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారారు. ఆమె నటించిన 'కావాలయ్య', 'డా డా డాస్' వంటి పాటలు షేక్ చేశాయి. ఇప్పుడు అదే జోరుతో చిరంజీవి సినిమాలో కూడా మాస్ ఆడియన్స్‌కు అదిరిపోయే కిక్ ఇవ్వడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. చిరంజీవి లేటెస్ట్ మూవీ 'మన శంకర వరప్రసాద్ గారు'లో స్పెషల్ సాంగ్ ఉండనుందని, అందులో మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా మెగాస్టార్‌తో కలిసి స్టెప్పులేయనున్నారని సమాచారం.

మీనాక్షి చౌదరి అందాల మాయ



గ్లామరస్ లుక్‌లు ఆమెకు కొత్తకాదు కానీ, ఈసారి మాత్రం మీనాక్షి చౌదరి చూపిన అటిట్యూడ్ చూస్తే ఏవరికైనా వావ్ అనిపించకమానదు. బ్లాక్ షైనీ డ్రెస్‌లో ఆమె చేసిన ఫోటోషూట్ ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. కాస్త బోల్డ్‌గా కనిపించిన మీనాక్షి స్టైలింగ్‌లోని ఫినిషింగ్, హేర్ డూ, మేకప్ అన్నీ కూడా పర్ఫెక్ట్ అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఫ్రెంచ్ మ్యూజిక్‌కి స్టయిలిష్‌గా పోజులిచ్చిన ఈ ఫోటోలు యువతను ఆకర్షిస్తున్నాయి. మెడ దగ్గర నుండి స్లీవ్‌కు లూప్ లా డిజైన్ చేసిన డ్రెస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రత్యేకంగా చెప్పాల్సిన విషయం ఏంటంటే, ఆమె కళ్ల లుక్స్, కెమెరాకి ఆమె ఇచ్చిన లుక్స్‌లో కనిపించిన కాన్ఫిడెన్స్, ఫెమినిన్ గ్రేస్ అన్నీ కలిసి ఫోటోషూట్‌ను లెవెల్ మీదకు తీసుకెళ్లాయి.

ఎట్టకేలకు అసలు విషయం బయటపెట్టిన సింగర్



బాలీవుడ్ హాట్ బ్యూటీ దిశా పటానీ మళ్ళీ వార్తల్లో నిలిచింది. ఈసారి తన సినిమాల కంటే వ్యక్తిగత విషయాల వల్లనే నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. టైగర్ ష్రాఫ్‌తో లాంగ్ రిలేషన్‌షిప్‌కు బ్రేక్ పడిన తర్వాత, ఈ భామ పంజాబీ పాప్ సింగర్ తల్విందర్ సింగ్‌తో ప్రేమలో ఉందంటూ గత కొన్ని రోజులుగా బాలీవుడ్ మీడియా కోడై కూస్తోంది. కృతి సనన్ సోదరి నుపుర్ సనన్ పెళ్లి వేడుకల్లో దిశా, తల్విందర్ జం టగా సందడి చేయడంతో ఈ పుకార్లు షికారు చేశాయి. వీరిద్దరూ కలిసి దిగిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడి యాలో వైరల్ అవ్వడంతో, దిశా కొత్త ప్రియుడు ఇతడేనంటూ నెటిజన్లు ఫిక్స్ అయిపోయారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న తల్విందర్ సింగ్ (ఎజీశ్రీలితినిటవతీ ఎాతినిణష్ట్ర)ఈ వార్తలపై ఘాటుగానే స్పందించాడు. "మాపై ఇంత త్వరగా అందరి దృష్టి పడుతుందని ఊహించలేదు. మేం ఒకరినొకరు పరిచయమై కొద్ది కాలమే అవుతోంది. ప్రస్తుతం ఒకరి గురించి ఒకరం తెలుసుకునే ప్రయత్నంలో ఉన్నాం. ఇలాంటి పుకార్ల వల్ల వచ్చే ఒత్తిడిని మేం కోరుకోవడం లేదు. మా మధ్య ఉన్నది కేవలం స్నేహం మాత్రమే. దయచేసి తప్పుడు వార్తలు ప్రచారం చేయకండి" అని తల్విందర్ స్పష్టం చేశాడు.అయితే, ఇంటర్వ్యూ చివరలో యాంకర్ అడిగిన ఓ ప్రశ్నకు తల్విందర్ ఇచ్చిన సమాధానం ఇప్పుడు మరింత ఆసక్తికరంగా మారింది. "మీకు ప్రేమపై నమ్మకం ఉందా?" అని అడగ్గా.. "నేను ప్రతిరోజూ ప్రేమిస్తూనే ఉంటాను, ఇప్పుడు కూడా ప్రేమిస్తున్నాను" అంటూ నవ్వుతూ బదులిచ్చాడు. దీంతో అతను దిశాను ఉద్దేశించే ఈ కామెంట్స్ చేశాడా? అనే చర్చ మళ్ళీ మొదలైంది. కొంతమంది ట్విస్ట్ అదిరిపోయిందని అంటున్నారు.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com